ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం విజయవంతం చేయాలి

మంచిర్యాలక్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సాంఘీక సంక్షేమ గురుకులాల్లో విద్యను అభ్యసించిన పూర్వ విద్యార్థులకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంప్లాయిమెంట్ ట్రైనింగ్ ప్రోగ్రాం విజయవంతం చేయాలని సంక్షేమ మహిళ డిగ్రీ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ డాక్టర్ అనూష తెలిపారు. రాష్ట్రంలో గురుకులాల్లో చదువుకున్న పది, ఇంటర్, డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులు ఉద్యోగం లేని 18 నుంచి 25 సంవత్సరాల వయస్సుల గల పూర్వ విద్యార్థులు తమ పేర్లను నమోదు చేసు కొని గురుకుల సొసైటీ అందించే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు కోసం 7995010674 సంప్రదించాలని కోరారు.

కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

మంచిర్యాలక్రైం, జూన్6 (ఆంధ్రజ్యోతి): నగరపాలక సంస్థలో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలని శుక్రవారం కమిషనర్ శివాజీకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సంఘం గౌరవ అధ్యక్షులు హరిక్రిష్ణ మాట్లాడుతూ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనరేట్‌లో పని చేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు రెండేళ్లుగా యూనిఫాం, చెప్పులు, రేయిన్‌కోట్, కనీస మౌలిక సదుపాయాలను అందించాలని వినతిపత్రం అందజేశామన్నారు. దీనికి కమిషనర్ సానుకూలంగా స్పందించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షులు గోగర్ల ఆశయ్య, నాయకులు శ్యాంకుమార్, లింగయ్య, శ్రీనివాస్, తిరుపతి, సత్తయ్య, పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చు

● జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్



కెమెరాలను ప్రారంభిస్తున్న ఏసీపీ వెంకటేశ్వర్

జైపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : సీసీ కెమెరాలతో నేరాలను నియంత్రించవచ్చని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్ పేర్కొన్నారు. శుక్రవారం మండలంలోని టేకుమట్ల గ్రామంలో నేను సైతం కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన 14సీసీ కెమెరాలను ప్రారంభించారు. ఏసీపీ మాట్లాడుతూ ప్రతి గ్రామంలో పురవీధుల గుండా సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. నేరాలు, దొంగతనాలు జరిగినప్పుడు నేరస్తులను సులువుగా గుర్తించవచ్చన్నారు. ఒక్క సీసీకెమెరా వంద మంది పోలీసులతో సమానమని పేర్కొన్నారు. పోలీసులకు వ్యాపారస్తులు, ఇతర సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు సహకరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శ్రీరాంపూర్ సీఐ వేణుచందర్, జైపూర్ ఎస్‌ఐ శ్రీధర్, గ్రామస్థులు పాల్గొన్నారు.



రేషన్‌షాపు వద్ద బారులు తీరిన లబ్ధిదారులు

బియ్యం కోసం బారులు

- కిక్కిరిసిపోతున్న చౌకధరల దుకాణాలు
- టోకెన్ల పద్ధతిని అవలంబిస్తున్న డీలర్లు
- రోజుకు రెండుపూటలా పంపిణీ
- డీలర్లకు తప్పని ఇబ్బందులు

మంచిర్యాల, జూన్6 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని లబ్ధిదారులకు ఇబ్బందులు కలుగకుండా ఉండడం కోసం కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన విధంగా ఒకేసారి మూడు నెలల బియ్యం పంపిణీకి భారీ స్పందన లభిస్తోంది. ఉదయం 7గంటల నుంచే షాపులవద్ద లబ్ధిదారులు బారులు తీరుతున్నారు. రద్దీని దృష్టిలో ఉంచుకొని డీలర్లు టోకెన్ల పద్ధతి అవలంబిస్తున్నారు. రెండు పూటల చౌకధరల దుకాణంలో బియ్యం పంపిణీ చేస్తున్న రద్దీ ఏమాత్రం తగ్గడం లేదు. పైగా సన్నబియ్యం కావడంతో వాటిని తీసుకు నేందుకు లబ్ధిదారులు ఎగబడుతున్నారు. గతంలో రేష న్‌దుకాణాల ద్వారా దొడ్డు బియ్యం పంపిణీ చేయగా లబ్దిదారుల్లో సగానికిపైగా వాటిని తినేందుకు ఇష్టప డేవారు కాదు. దీంతో ఆ బియ్యాన్ని బయట మార్కెట్‌లో, డీలర్లకు విక్రయించేవారు. ప్రస్తుతం బియ్యం తిన గలిగే విధంగా ఉండడంతో లబ్ధిదారులు క్రమం తప్పకుండా తీసుకెళ్తున్నారు. దీంతో సన్నబియ్యం అక్రమ రవాణా సైతం తగ్గుముఖం పట్టింది. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఉగాది నుంచే సన్నబియ్యం పంపిణీకి రేవంత్ సర్కార్ శ్రీకారం చుట్టింది.

డీలర్లకు పెరిగిన పని భారం..

సన్న బియ్యం పంపిణీకి కాంగ్రెస్ ప్రభుత్వం శ్రీకారం చుట్టడంతో లబ్ధిదారులు వాటిని తినేందుకు ఇష్టపడుతున్నారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన వారు బియ్యాన్ని సక్రమంగా తీసుకుంటున్నారు. ఉగాది నుంచే రేషన్‌షాపుల వద్ద లబ్ధిదారులు బారులు తీరుతుండగా ఒకేసారి మూడు నెలల పంపిణీ కార్యక్రమంతో మరింతగా వారి సంఖ్య రెట్టింపైంది. 1వతేదీ నుంచి 15వరకు బియ్యం పంపిణీ చేసే సమయం ఉన్నప్పటికీ ముందుగా తీసుకోవాలన్న కుతూహలంతో ఉదయం నుంచే లబ్ధిదారులు బారులు తీరుతున్నారు. దీంతో రేషన్ డీలర్లపై అధిక పనిభారం తప్పడం లేదు. దీనికి తోడు సర్వర్లు సక్రమంగా పని చేయక పోవడంతో వేలిముద్రలు, ఐరిష్ సేకరణలో తీవ్ర జాప్యం జరుగుతోంది. మరోవైపు లబ్ధిదారులకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 5:1నిష్పత్తిలో బియ్యం పంపిణీ చేస్తు న్నాయి. ఒక్కో లబ్ధిదారుడికి 6కిలోల చొప్పున పంపిణీ చేయాల్సి ఉంటుంది. గతంలో గంప గుత్తగా ఒక్కో లబ్ధిదారుడికి 6కిలోలు జోకి డీలర్లు అందజేసేవారు. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వాల వాటాల ప్రకారం వేర్వేరుగా బియ్యం జోకాల్సిన నెలకొన్నాయి. కేంద్ర ప్రభుత్వానికి సంబంధించి ఐదుకిలోలు, రాష్ట్ర ప్రభుత్వానికి సంబంధించి కిలో బియ్యం వేర్వేరుగా జోకుతున్నారు. ఇందుకుగాను లబ్ధిదారుడి నుంచి రెండేసిసార్లు వేలిముద్రలు, ఐరిష్ సేకరించాల్సి వస్తోంది. ఈ క్రమంలో రోజుకుసగటున 20మందికి కూడ బియ్యం పంపిణీ జరుగడం లేదు. ఉదయం 7నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 5 నుంచి 7గంటల వరకు బియ్యం పంపిణీ చేస్తున్న రద్దీ తగ్గడం లేదు. ఈ క్రమంలో లబ్ధిదారుడికి బియ్యం పంపిణీ చేయాలంటే కనీసం 15నిమిషాల సమయం పడుతుందని డీలర్లు చెబుతున్నారు. మూడు నెలల కు సంబంధించి బియ్యం పంపిణీ చేయాల్సి రావడంతో మూడుసార్లు వే ర్వేరుగా బయోమెట్రిక్ తీసుకోవాల్సి వస్తుందంటున్నారు.

నిర్ణీత సమయం పెంచాలి...

రేషన్ షాపుల వద్ద బయోమెట్రిక్ సేకరించేందుకు లబ్ధిదారుడికి అధిక సమయం పడుతుండడంతో నిర్ణీత గడువులోపు పూర్తిస్థాయిలో బియ్యం పంపిణీ జరిగేలా లేదు. సాధారణంగా ప్రతి నెల 1వ తేదీ నుంచి 15 వర కు చౌకధరల..

(తరువాయి 7లో)

రెవెన్యూ సదస్సులతో భూసమస్యలకు పరిష్కారం

నెన్నెల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : భూభారతి నూతన ఆర్‌వోఆర్ చట్టం అమలులో భాగంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులతో భూసమస్యలకు శాస్వత పరిష్కారం లభిస్తుందని కలెక్టర్ కుమార్‌దీపక్ అన్నారు. మండలంలోని జెండావెంకటాపూర్, నారాయిపేట గ్రామాల్లో శుక్రవారం నిర్వహించిన సదస్సుల్లో కలెక్టర్ పాల్గొని దరఖాస్తుల ప్రక్రిను పరిశీలించారు. రైతుల నుంచి వచ్చిన దరఖాస్తులను పరిశీలించి రికార్డులతో సరిచూసి, క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను పరిష్కరిస్తామన్నారు. ఈ నెల 20వ తేది వరకు జిల్లాలోని అన్ని మండలాల్లో సదస్సులు నిర్వహించి దరఖా స్తులు తీసుకుంటామన్నారు. నూతనం చట్టం ద్వారా రికార్డుల్లోని తప్పులను సవరించే అవకాశం ఉందన్నారు. రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసేముందు భూములు వివరాలు పూర్తిస్థాయిలో సర్వే చేసి, నక్ష తయారు చేస్తారని చెప్పారు. పెండింగ్ సాదాబైనామా దరఖాస్తులను నిబంధనల ప్రకారం పరిశీలించి, అర్హులకు పట్టాచేస్తామన్నారు. వారసత్వ భూములకు నిర్ణీత కాలంలో సమగ్ర విచారణ చేపట్టి వారసులకు నోటీ సులు ఇస్తామన్నారు. దరఖాస్తుతో పాటు రిజిస్టర్ దస్తావేజులు, రెవెన్యూ రికార్డులు జత చేస్తే త్వరగా పరిష్కారం లభిస్తుందన్నారు. అటవీ భూముల్లో సాగుకు చేసుకున్న దరఖాస్తులను సంబంధిత కమిటీ పరిశీలించి తగు చర్యలు తీసుకుంటుందన్నారు. వానాకాలం పంట సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా అన్ని చర్యలు తీసుకున్నామన్నారు. సీజన్‌కు సరిపడ యూరియా అందుబాటులో ఉంచు తామన్నారు. మిషన్ భగీరథ నీరు ప్రతి వీధికి అందేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మంచిర్యాల నుంచి నార్వాయిపేటకు ఆర్టీసీ బస్సు నడిపించాలని అక్కడి ప్రజలు కోరగా, అధికారులతో మాట్లాడి బస్సు నడిపిస్తామన్నారు. నూతన రేషన్ కార్డుల కోసం చేసుకున్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హులందరికి రేషన్‌కార్డులు మంజూరు చేస్తామన్నారు. ధాన్యం సేకరణ ముగింపు దశకు చేరుకున్నదని, కళ్లాలోలని ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. మైలారంలో రేషన్‌షాపును సందర్శించి సన్నబియ్యం సరఫరాను పరిశీలించారు. మూడు నెలల బియ్యాన్ని ఈనెల 30 లోగా ఒకేసారి సరఫరా చేస్తామన్నారు. ఆయన వెంట తహసీల్దార్ మహేంద్రనాథ్, డిప్యూటీ తహసీల్దార్ ప్రకాష్ ఉన్నారు.



నార్వాయిపేటలో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ కుమార్ దీపక్

కవ్వాల్ టైగర్‌జోన్‌లో ప్లీడర్ల బృందం పర్యటన



కవ్వాల్ టైగర్‌జోన్‌లో సందర్శిస్తున్న న్యాయవాదులు

జన్నారం, జూన్6 (ఆంధ్రజ్యోతి) : కవ్వాల్ టైగర్ జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో రాష్ట్ర కోర్టు ప్రభుత్వకోర్టు ప్లీడర్లు మహేశ్‌రాజుతో పాటు12 మంది ప్లీడర్ల బృందం అటవీ ప్రాంతాల్లో పర్యటిం చారు. ఈసందర్భంగా జన్నారం డివిజన్‌లోని గోండు గూడ, మల్యాలవాచ్‌టవర్, బైసన్‌కుంట, నీల్‌గాయి కుంటతో పాటు పలు ప్రాంతాల్లో పర్యటించారు. ఉదయాన్నే అటవీసఫారీలు అటవీ ప్రాంతంలోకి వెళ్లి అడవిలో తిరిగే వన్యప్రాణులు చూశారు. అదే విధంగా మల్యాల అటవీ ప్రాంతంలోని ముఖ్యంగా పక్షులు ఉండే ప్రాంతంలో పక్షలను వీక్షించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ కవ్వాల్ అభయారణ్యంలో ఎంతో అందంగ ఉందని అటవీ ప్రాంతంలో చేపట్టిన అభివృద్ధి పనులు బాగున్నాయన్నారు. వారివెంట తాళ్లపేట రేంజ్ అధికారి సుష్మరావు, జన్నారం డిప్యూటి రేంజ్ అధికారి మమత, బీట్ అధికారి లాలుబాయి, తిరుమలేశ్‌లతో పాటు లక్షెట్టిపేట సీఐ రమణామూర్తి, జన్నారం ఎస్‌ఐ గొల్లపల్లి అనూష, సిబ్బంది ఉన్నారు.

పోడు రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలి

భీమారం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : పోడు రైతులకు బ్యాంకు రుణాలు ఇవ్వాలని సేవాలాల్ సేన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అజ్మీర తిరుపతినాయక్ అన్నారు. శుక్రవారం భీమారం మండల కేంద్రంలో శుక్రవారం సేవాలాల్‌సేన జిల్లా అధ్యక్షుడు గుగులోత్ మల్లేష్‌నాయక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అటవీ హక్కు పత్రాలు కలిగిన గిరిజన రైతులకు బ్యాంకు రుణం ఇవ్వాలని, అదేవిధంగా రాష్ట్రంలో అధిక జనాభా కలిగిన బంజారాజాతికి చెందిన శాసనసభ్యునికి మంత్రి పదవీ ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సేవాలాల్ సేన జిల్లా ముఖ్య సలహాదారునిగా ధరావత్ రాజునాయక్, సేవాలాల్ సేన భీమారం మండల మహిళఅధ్యక్షురాలుగా ఇస్లావత్ యమునాబాయిలను ఎన్నుకున్నారు. నూతన కార్యవర్గ సభ్యులకు నియామక పత్రాలు అందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రచార కార్యదర్శి దేవేందర్‌నాయక్, మండల అధ్యక్షుడు మోతి లాల్, హరిలాల్‌నాయక్, తేజావత్ మోహన్‌లాల్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.



నూతన కమిటీ సభ్యులకు నియామక పత్రాలు అందిస్తున్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి

చేప పిల్లల పంపిణీకి ప్రతిపాదనలు

- జిల్లాలో నీటి వనరులు అనుకూలం...
- మత్స్య కారులకు ఉపాధి అవకాశాలు..

నస్పూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో నీటి వనరుల్లో మత్స్య సంపద పెంచి ఉపాధి అవకాశాలు మెరుగుపర్చాలని మత్స్యశాఖ నిర్ణయించి ఈ ఏడాది చేపపిల్లల పంపిణీకోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు తయారుచేసి పంపించింది. జిల్లాలోని 372 చెరువులు, కుంటలు, మధ్య చిన్న, తరహా ప్రాజెక్టులుండగా 125మత్స్య సహాకార సంఘాలు పని చేస్తున్నాయి. ఇందులో సుమారు ఏడువేల మంది మత్స్యకారులు సభ్యత్వం కలిగి ఉపాధి పొందుతున్నారు. ఈ ఏడాది 2.18కోట్ల చేప పిల్లలు అవసరమని మత్స్యశాఖ ప్రభుత్వానికి ప్రతిపాదనలు రూపొందించి పంపించింది. ప్రభుత్వం నుంచి అనుమతులు వచ్చిన తర్వాత చేప పిల్లల కొరకు టెండర్ పిలిచి ఆ ప్రక్రియను పూర్తి అనంతరం చెరువులు, కుంటలు, ప్రాజెక్టుల్లో వేస్తారు. గతేడాదిలో టెండర్ ప్రక్రియ



అలస్యం కావడంతో చెరువులు, ప్రాజెక్టుల్లో సకాలంలో చేప పిల్లలను వేయలేకపోయారు. ఈ ఏడాదిలో సమృద్ధిగా వర్షాలు కురిసి ప్రభుత్వం నుంచి అనుమతి, టెండర్ ప్రక్రియ పూర్తయితే నీటి వనరుల్లో సకాలంలో చేప పిల్లలు పడే అవకాశం ఉంటుంది.

● ఎక్కడెక్కడ...

జిల్లాలో 372 కుంటలు, చెరువులు, ఎల్లంపల్లి ప్రాజెక్టుతో పాటు మరోమూడు చిన్నతరహా ప్రాజెక్టు లు ర్యాలీవాగు, నీల్వాయి వాగు, గొల్లవాగులున్నాయి. ఈ ప్రాజెక్టుల్లో రవ్వ, బొచ్చ, బంగారు తీగ, మోసు రకాల చేప పిల్లలను తెప్పించనున్నారు. జూన్‌లో వర్షాలు మొదలైతే చెరువులు, ప్రాజెక్టులోకి వరద నీరు వచ్చి చేరడంతో నీటి మట్టం పెరుగుతాయి. ఆశించిన విధంగా వర్షాలు సమృద్ధిగా కురిస్తే జూలై, సెప్టెంబర్ మాసాల్లో చేప పిల్లలను నీటి వనరుల్లో వేసే అవకాశం ఉంటుంది. సకాలంలో వదిలితేనే బరువు పెరిగి మత్స్యకా రులకు లాభాలు వస్తాయి. జిల్లాలో చేపల వ్యాపారానికి మంచి గిరాకి ఉన్నది. ఇతర ప్రాంతాల నుంచి కూడా వివిధ రకాల చేపలు ఇక్కడకు వ్యాపారులు తరలించి విక్రయిస్తారు. మత్స్యకార కుటుంబాలు చేపలను పట్టుకుని జీవనోపాధిని పొందుతారు.

● ప్రతిపాదనలు పంపినాము..

- ఆర్. అవినాష్- మత్స్య శాఖ జిల్లా అధికారి

జిల్లాలో నీటి వనరులల్లో పెంపకంకోసం 2.18 కోట్ల చేప పిల్లల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు తయారు చేసి పంపినాము. ప్రభుత్వం నుంచి అను మతి వచ్చిన తర్వాత టెండర్ ప్రక్రియ ఉంటుంది. అది పూర్తయిన తర్వాత చేప పిల్లలను పంపిణీ చేయనున్నాము.

సమగ్ర ఆరోగ్య శిబిరానికి స్పందన



ఆరోగ్య శిబిరంలో పాల్గొన్న వైద్యులు, ప్రజలు

మంచిర్యాలకలెక్టరేట్, జూన్6 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణంలోని ఎన్టీఆర్ నగర్‌లో శుక్రవారం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో సమగ్ర ఆరోగ్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా క్షయవ్యాధి, మధుమేహం, హెచ్‌ఐవీ ఎయిడ్స్ వ్యాధుల నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రెండు వారాలకు మించి దగ్గు ఉన్నట్లయితే క్షయ వ్యాధిగా అనుమానించి తెమడ పరీక్షకు దగ్గరలోని ఆరోగ్య కేంద్రాన్ని సం ప్రదించాలని తెలిపారు 30 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరు రక్త పోటు, మధుమేహం స్థాయిని తెలుసుకోవడానిక పరీక్షలు చేయించుకోవాలన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడేగా పాటించి నిలువ నీటి గుంటలను పూడ్చివేసి దోమల ఉత్పత్తిని అరికట్టాలన్నారు. ఈ వైద్య శిబిరంలో డా. శివప్రతాప్, డా. రామకృష్ణ, డా. నిహారిక, హెల్త్ ఎ డ్యూకేటర్ అల్లాడి శ్రీనివాస్, సిహెచ్‌వో రామ్మూర్తి, జిల్లా క్షయ వ్యాధి ప్రోగ్రాం కోఆర్డినేటర్ సురేందర్, దిశా జిల్లా డాట్ మేనేజర్ సంతోష్, ఐసీటీసీ కౌన్సిలర్ శ్రీలత, టీబీహెచ్‌వి స్వప్న, పాల్గొన్నారు.

ఉద్యోగులను వంచించిన ప్రభుత్వం



మాట్లాడుతున్న తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం నాయకులు

చెన్నూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : క్యాబినెట్ మీటింగ్‌లో ఉద్యోగులకు ఉపశమనం కలుగుతుందని ఎదురు చూసిన ఉద్యోగులకు నిరాశే మిగిలిందిన తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు నయింపు శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం చెన్నూరులో ఆయన మాట్లాడుతూ ప్రతీ ఆరు నెలలకు ఒక డీఏ ఇవ్వాల్సిన ప్రభుత్వం రెండు సంవత్సరాలుగా ఐదు డీఏలు పెండింగ్‌లో ఉంటే ఇప్పుడు ఒక డీఏ ఇస్తూ పది నెలల తర్వాత ఇచ్చే డీఏను ఇప్పుడే ప్రకటించి 2 డీఏలు ఇస్తున్నామని మోస పూరిత ఆలోచనను వ్యతిరేకిస్తున్నామన్నారు. ప్రజలు అడగని ఉచితాలను ఇస్తూ ఉద్యోగుల బకాయిలను ఇవ్వకుండా వేధించడం సరైంది కాదన్నారు. వెంటనే డీఏలను చెల్లించాలని, సీపీఎస్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు నాగరాజు, సాంబయ్య, సురేష్, చంద్రయ్య, ప్రవీణ్, సునీల్ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి



మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

బెల్లంపల్లి, జూన్6 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటిల్లోని పలువార్డుల్లో సమ స్యలు పరిష్కరించాలని కోరుతూ శుక్రవారం సీపీఐ నాయకులు మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ పట్టణంలోని పలువార్డుల్లో అత్యవసర సమయాల్లో అంబులెన్స్‌లు పోయేందుకు కూడ వీలులేకుండా స్థలాలు కబ్జా చేశారని వెంటనే చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమ నిర్మాణాలను తొలగించి సమస్యలు పరిష్కరించాలన్నారు. పలువార్డుల్లో ఎక్కడ పడితే అక్కడ చెత్తచెదారం ఉంటుందని దీంతో రానున్న వర్షాకాలం నేపథ్యంలో ప్రజలు అనారో గ్యబారిన పడే అవకాశాలు ఉన్నాయన్నారు. పారిశుధ్య చర్యలు పకడ్బందీగా చేపట్టాలని, వీధీ దీపాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రాజీవ్ యువ వికాస్, ఇందిరమ్మ ఇండ్లను అర్హులైన లబ్ధిదారులకు కేటాయించాలని సూచించారు. మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీలతో ప్రతి రోజు నీరు సరఫరా కావడం లేదని దీంతో ప్రజలు తాగు నీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. పట్టణంలోని పలువా ర్డులకు ఉపయోగకరంగా ఉండేందుకు కన్నాల బస్తీల సమయంలో వైకుంఠదామం ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సమస్యలు పరిష్కరించేందుకు చొరవ చూపాలని లేని యెడల సీపీఐ ఆధ్వర్యంలో ఆందోళనలు చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర సమితి సభ్యురాలు బొల్లం పూర్ణిమ, పట్టణ కార్యదర్శి రాజమౌళి, సహాయ కార్యదర్శి తిలక్, నాయకులు ఉపేందర్, రాజేశ్, శంకర్‌లు పాల్గొన్నారు.

పాత మంచిర్యాల ప్రభుత్వ పాఠశాలపై ప్రత్యేక శ్రద్ధ



పాత మంచిర్యాల ప్రభుత్వ పాఠశాల వద్ద పనులను పర్యవేక్షిస్తున్న కాంగ్రెస్ నాయకులు

మంచిర్యాలక్రైం, జూన్6 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేంసాగర్‌రావు పాత మంచిర్యాల పాఠశాలపై ప్రత్యేక దృష్టి పెట్టారని కాంగ్రెస్ పట్టణ అధ్యక్షులు తూముల నరేశ్ అన్నారు. పాఠశాల అభివృద్ధి కోసం డీఎంఎఫ్‌టీ ఫండ్ ద్వారా 40లక్షలతో, అమ్మ ఆదర్శ పథకం ద్వారా రూ.7లక్షలు, పదిలక్షలతో పాఠశాల పెయింటింగ్ పనులను ప్రారంభించారన్నారు. ఈ సందర్భంగా నరేశ్ మాట్లాడుతూ తాను చదువుకున్న పాఠశాలను అభివృద్ధి చేయడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. పాత మంచిర్యాల కోసం నిధులు కేటాయించడం పట్ల ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలి పారు. ఈ కార్యక్రమంలో బొలిశెట్టి కిషన్, సింగిల్‌విండో డైరెక్టర్ తూముల వెంకటేశ్, రామగిరి రాజు, అసరి మల్లేశ్, కాయితి నరేశ్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

శ్రీరాంపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : కమ్యూనిటీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌లో భాగంగా కోల్‌బెల్ట్ ప్రాంతం, సమీప గ్రామాలలోని నిరుద్యోగ యువతకు ఇచ్చే శిక్షణ దరఖాస్తు చేసుకోవాలని డీజీఎం(పర్సనల్) అరవిందరావు ఒక ప్రకటనలో కోరారు. హైదరాబాద్ కుషాయి గూడలో ఉన్న ఎలక్ట్రానిక్స్ సెక్టార్‌స్కిల్స్ కౌన్సిల్‌ఆఫ్ఇండియా(ఈఎస్ఎస్‌సీఐ) ద్వారా పలు అంశాల్లో శిక్షణ ఇవ్వనున్నట్లు పేర్కొన్నారు. గ్యాస్ చార్జింగ్(రిఫ్రిజిరేటర్ అండ్ఎయిర్‌కండిషనర్), ఎయిర్‌కండిషనర్ ఇన్‌స్టాలేషన్, వాటర్ ప్యూరిఫైయర్ నిర్వహణ, మరమ్మతులు, రిఫ్రిజి టేర్, వాషింగ్ మెషిన్, డిష్ వాషర్, ఎయిర్ కండిషనర్ మరమ్మతులు, ఇన్‌స్టాలేషన్, గ్యాస్‌చార్జింగ్, టీవీ మానిటర్, ఓవెన్, వాటర్ ప్యూరిఫైయర్, బేసిక్ హెచ్‌ఏ రిపేర్, ఇన్‌స్టాలేషన్‌లు నేర్పిస్తారని, కోర్సు పూర్తి చేసిన యువత కు ఎన్‌సీవీఈటీ సర్టిఫికెట్ జారీ చేస్తారని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు దరఖాస్తుతో పాటు విద్యార్హతలకు సంబంధించిన జిరాక్స్‌కాపీలను శ్రీరాంపూర్‌లోని వృత్తి శిక్షణాకేంద్రంలో అందించాలని సూచించారు.

బావిలోపడి వృద్ధురాలి మృతి



శంకరవ్వ(ఫైల్)

లక్షెట్టిపేట, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మున్సిపాలిటీ పరిధిలోని గంపలపల్లి గ్రామంలో ప్రమాదవశాత్తు బావిలో పడి బొప్పు శంకరవ్వ(69) అనే వృద్ధురాలు మృతి చెందింది. మృతురాలి స్వస్థలం జగిత్యాల జిల్లా దర్మపురి మండలం రాయపట్నం. ఈనెల 4న తన మనుమడి వివాహం సందర్భంగా గంపలపల్లికి వచ్చింది. రాత్రి ఇంటికి వెళ్తున్నట్లు బంధువులతో చెప్పి వెళ్లిపోయింది. అర్ధరాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు మరుసటి రోజు రాత్రి వరకు చుట్టుపక్కల, బంధువుల ఇళ్లలో వెతికినా ఆచూకీ లభించకపోవడంతో తన కూతురు మంగవ్వ లక్షెట్టిపేట పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఎస్సై సురేష్ మిస్సింగ్ కేసు నమోదు చేసారు. శుక్రవారం ఉదయం గంపలపల్లి ఇంటి సమీపంలో మృతురాలు శవం లభ్యం కావడంతో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ చెరువులో పడి..

చెన్నూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గంగారం గ్రామంలో ట్రాక్టర్‌తో పంట చేనును దున్నుతుండగా ప్రమాదవశాత్తు చెరువులో పడి కామెర తిరుపతి(45) అనే వ్యక్తి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మంథని మండలం దుబ్బపల్లికి చెందిన తిరుపతి తన అత్త గారి గ్రామమైన చెన్నూరు మండలం గంగారం గ్రామానికి నెల రోజుల క్రితం వచ్చి ఇక్కడే ఉంటున్నాడు. తిరుపతి ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. శుక్రవారం ట్రాక్టర్‌తో తన బంధువుల పంట చేనును దున్నుతున్నాడు. ట్రాక్టర్‌ను రివర్స్‌లో ఒడ్డుపైకి ఎక్కిస్తున్న క్రమంలో ప్రమాదవశాత్తూ ట్రాక్టర్ పక్కన ఉన్న చేపల చెరువులో పడింది. అందులో కొంత నీరు ఉండడంతో తిరుపతి అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిపారు. తిరుపతికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

జన్నారం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని బస్టాండ్ వద్ద అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకొని సీజ్ చేసి డ్రైవర్ శ్రీనివాస్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ అనూష తెలిపారు. ఆమె మాట్లాడుతూ మండలంలో అక్రమంగా అనుమతులు లేకుండా ఇసుక రవాణ చేసిన చట్ట వ్యతిరేక కార్యాకలాపాలకు పాల్పడ్డ చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రమాదవశాత్తు షెడ్డు దగ్ధం



కాలుతున్న రేకుల షెడ్డు

జన్నారం, జూన్6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తిమ్మాపూర్ గ్రామంలో శుక్రవారం ప్రమాదవశాత్తు మల బారు కర్ర నిల్వ ఉంచిన రేకుల షెడ్డు దగ్ధమైంది. ఫైర్ అధికారి శ్రీనివాస్ తెలిపిన వివరాల మేరకు తిమ్మా పూర్ గ్రామానికి చెందిన జినుగురు వెంకటస్వామి స్వామి తన ఫాంలో ఇటీవల మలబారు కర్రను రేకుల షెడ్డులో నిల్వ ఉంచాడు. ప్రమాదవశాత్తు మంటలు అంటుకోవడంతో పూర్తి స్థాయిలో దగ్ధమైంది. నష్టం అంచనా వేస్తున్నట్లు ఫైర్ అధికారులు తెలిపారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి

జన్నారం,జూన్6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కవ్వాల గ్రామానికి చెందిన జక్కుల లక్ష్మికి చెందిన గేదె గురువారం రాత్రి కొత్తపేట శివారులో గల మేతకోసం ట్రాన్స్‌ఫార్మర్‌వద్దకు వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుదాఘాతానికి గురై మృతి చెందింది. గేదె విలువ రూ.80వేలు ఉంటుందని తెలిపారు. ప్రభుత్వ పరంగా ఆదుకోవాలని బాధితురాలు లక్ష్మి కోరారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అందజేత

సిర్పూర్(టి), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జక్కాపూర్ గ్రామానికి చెందిన వ్యక్తి పోగొట్టుకున్న సెల్‌ఫోన్‌ను శుక్రవారం ఎస్సై కమలాకర్ బాధితుడికి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సెల్‌పోన్ పోయినా, చోరీకి గురైనా ఫిర్యాదు చేయాలని సూచించారు. ఆయన వెంట ఏఎస్సై పాల్ తదితరులు ఉన్నారు.

అడ్డ దారుల్లో..

- బస్సుల దారి మళ్లింపుతో ప్రభుత్వ ఆదాయానికి గండి
- టోలు గేట్లు, చెక్ పోస్టులను తప్పించుకుంటున్న అక్రమార్కులు



కాగజ్‌నగర్ మీదుగా ఛత్తీస్‌గఢ్‌కు వెళుతున్న బస్సు(ఫైల్)

కాగజ్‌నగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): నిబంధనలను ఉల్లంఘిస్తూ నిత్యం సికింద్రాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్‌కు ప్రయివేటు బస్సుల ద్వారా ప్రయాణికులను తమ గమ్యస్థానాలకు చేరవేస్తున్నారు. సికింద్రాబాద్ నుంచి కరీంనగర్, మంచిర్యాల, ఆసిఫాబాద్, వాంకిడి మీదుగా మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌కు జాతీయ రహదారి మీదుగా రాకపోకలు సాగించాల్సి ఉంది. కానీ కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్డు నుంచి దారి మళ్లించి సిర్పూరు(టి) మీదుగా మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్‌కు అక్రమంగా బస్సులను నడిపిస్తున్నారు. సికింద్రాబాద్-ఛత్తీస్‌గఢ్‌కు జాతీయరహదారి మీదుగా వాంకిడి, బల్లార్షాతో పాటు పలు చోట్ల టోల్‌ట్యాక్సీ వసూలు చేస్తుండడం తో పన్ను ఎగవేత చేస్తూ లాభాలు గడిస్తున్నారు. మూడు టోల్ గేట్లకు కనీసం ఒక్క బస్సుకు రూ3 వేల నుంచి 5 వేల వరకు ఆదా అవుతుండడంతో అక్రమదారుల్లో ప్రయాణాలు చేస్తున్నారు. దీంతో పాటు దూరం సైతం తగ్గనుంది. సికింద్రాబాద్ నుంచి ఛత్తీస్‌గఢ్ చేరుకునేందుకు 718 కిలోమీటర్ల దూరం ఉంటుంది. కాగజ్‌నగర్ నుంచి సిర్పూరు(టి) మీదుగా మహారాష్ట్ర ఛత్తీస్‌గఢ్‌కు పోయేందుకు 80 కిలోమీటర్లు తగ్గుతుండడంతో ఈ మార్గం గుండా పోయేందుకు ఆసక్తి చూపుతున్నారు. నిత్యం 20 నుంచి 40 ప్రైవేటు బస్సులు ఈ మార్గంలో వెళుతున్నాయి.

● దృష్టి సారించని అధికారులు..

కాగజ్‌నగర్ క్రాస్ రోడ్డు నుంచి ఛత్తీస్‌గఢ్‌కు అక్రమంగా బస్సులు రాకపోకలు సాగిస్తున్నా అధికారులు దృష్టి సారించడం లేదు. నిత్యం ఈ బస్సులు రాత్రి వేళల్లో వెళ్తుంటే కనీసం పోలీసులు తనిఖీలు చేయలేదు. రోడ్డు రవాణా సంస్థ అధికారులు కూడా దృష్టి సారించడం లేదు. అధికారులకు మామూళ్లు ముడుతున్నందున తనిఖీలు చేపట్టేడం లేదని చెబుతున్నారు. దీంతో పాటు కాగజ్‌నగర్ క్రాస్ రోడ్డు నుంచి ఛత్తీస్‌గఢ్‌కు వెళ్లతున్న బస్సులు మితిమీరిన వేగంతో రాత్రి వేళల్లో రాకపోకలు సాగిస్తున్నాయి.

ఎనిమిది నెలల క్రితం కూడా ఓ బస్సు టైరు పూర్తిగా చెడి పోయింది. వెనుకాల ఉన్న వ్యక్తులు డ్రైవర్‌కు సూచిస్తున్న కూడా పట్టించుకోకుండా క్రాస్ రోడ్డు నుంచి అతి వేగంగా కాగజ్‌నగర్ చెక్ పోస్టు వరకు అలాగే తీసుకొచ్చారు. బస్సు ప్రమాద స్థాయిని గుర్తించిన డ్రైవర్ ఆపివేశారు. అప్పటికే పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. మూడు నెలల క్రితం కూడా బస్సు అదుపు తప్పి రోడ్డు కిందకు దిగింది. ఈ సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం చోటు చేసుకోలేదు. ప్రమాదం జరిగి ఉంటే పరిస్థితి ఏంటని ప్రజలు వాపోతున్నారు. కాగజ్‌నగర్, డాడానగర్, కోసిని, వేంప ల్లి మార్గంలో రాత్రి ఎనిమిది గంటలు దాటిందంటే వరుసగా బస్సులు వెళ్లతున్నాయని, అన్ని కూడా మితిమీరిన వేగంలో వెళ్లతున్నాయని చెబుతున్నారు. అధి కారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

అధికారులను అడ్డుకున్న పోడు రైతులు

సిర్పూర్(టి), జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) రేంజ్ పరిధిలోని చిలపెల్లి, మెట్‌ప ల్లి, రావన్‌పెల్లి, లింబుగూడ గ్రామాలకు శుక్రవారం ఎఫ్‌డీవో శశాంక్ వెళ్లగా అక్కడి పోడు వ్యవసాయ దారులు అయనను అడ్డుకున్నారు. ఈ సదర్భంగా పలువురు మాట్లాడుతూ తమ వద్ద భూములకు సంబంధించిన అన్ని పత్రాలు ఉన్నాయని చెప్పారు. దీంతో ఎఫ్‌డీవో, అటవీశాఖ అధికారులు వెను దిరిగి వెళ్లిపోయారు. ఈ విషయంపై అటవీశాఖ అధికారులను సంప్రదించగా వివరాలు వెల్లడించడానికి స్పందించలేదు.

ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ వేగవంతం చేయాలి

రెబ్బెన, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): వరి ధాన్యం కొనుగోలు ప్రక్రియ మరింత వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. ఎడవెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన యాసంగి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాల వద్ద నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని కేటాయించిన రైస్ మిల్లుకు పంపించాలన్నారు. వర్షా కాలం సమీపిస్తున్నందున వరి ధాన్యం తరలింపు వేగవంతం చేయాలని సిబ్బందికి సూచించారు. ఈయన వెంట తహసిల్దార్ సూర్య ప్రకాష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులు వేధించొద్దు



మాట్లాడుతున్న బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రవీణ్‌కుమార్

బెజ్జూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అటవీ అధికారులు పోడు భూములు సాగు చేసుకుంటున్న వారిని వేధించకుండా మానవత్వంతో వ్యవహరించాలని బీఆర్ఎస్ నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. భూస్వాములు వందల ఎకరాలు భూమి కలిగి ఉండి అటవీ అధికారులపై దాడి చేసినా పట్టించుకోకుండా పేద రైతులను ఇబ్బంది పెట్టడం సరికాదన్నారు. అటవీ భూములు దోచుకొని అక్రమంగా పట్టాలు పొందిన వారు రోడ్ల మీద తిరుగుతున్నారన్నారు. అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ వెంటనే స్పందించి అటవీ అధికారులను రైతులను వేధించకుండా ఆదేశించాలని డిమాండ్ చేశారు. రైతులకు వ్యవసాయం లేక పోతే వలస వెళ్లడం తప్ప మరో మార్గం లేదన్నారు. ఈ విషయంపై ఇప్పటికే జిల్లా అటవీ అధికారులతో మాట్లాడినట్లు తెలిపారు. సిర్పూర్ నియోజక వర్గంలో గంజాయి సరఫరా పెరిగిందని, యువత అప్రమత్తంగా ఉండి గంజాయి ఇంట్లోకి రాకుండా జాగ్రత్త వహించాలని కోరారు. ఇటీవల బెజ్జూరు ఎస్సై మీద దాడికి యత్నించిన మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప అనుచరులను చట్ట ప్రకారం శిక్షించాలని డిమాండ్ చేశారు. కోనప్ప అనుచరులు పేదల భూములను కబ్జా చేస్తున్నారని ఆరోపించారు. మర్తిడికి చెందిన చిన్నక్కకు చెందిన భూమిని బషరత్‌ఖాన్ అనే వ్యక్తి మాజీ ఎమ్మెల్యే అండతో కబ్జా చేశారని, వారి ఆగడాలను అరికట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సారయ్య ఖాతా, రాజు, హరి, వరలక్ష్మి, కమల, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): పోడు భూముల రైతులు అధైర్యపడొద్దని, అండగా ఉంటామని బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. మండలంలోని ఆరెగూడ గ్రామంలో 50 సంవత్సరాల నుంచి పోడు సాగు చేసుకుంటున్న రైతులతో శుక్రవారం ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రభుత్వం పేదలకు భూములు ఇచ్చిందని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం పేదల భూములను లాక్కొంటుందన్నారు. కుమ రం భీం జిల్లాను టైగర్ జోన్‌గా ప్రకటించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తక్షణమే దానిని రద్దు చేయాలన్నారు. పోడు రైతులకు అండగా నిలుస్తా మన్నారు. మీ భూములను మీరే సాగు చేసుకోవాలని ఎవరికి భయ పడాల్సిన అవసరం లేదన్నారు. ఆయన వెంట నాయకులు అస్లాంబీన్ అబ్దుల్లా, తదితరులు ఉన్నారు.

జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టును పరిశీలించి.. సూచనలు చేసి..



జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టును పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కాగజ్‌నగర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జగన్నాథ్‌పూర్ ప్రాజెక్టును శుక్రవారం అదనపు కలెక్టర్ దీపక్ తివారి పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్నాథ్ పూర్ ప్రాజెక్టుకు అధిక ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. ప్రాజెక్టు ద్వారా జిల్లాలో తాగు, సాగునీటికి ఇబ్బందులు తొలగిపోతాయని చెప్పారు. ప్రాజెక్టు ప్రస్తుత స్థితిని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తు ప్రణాళికలు రూపొందించాలన్నారు. జల్‌శక్తి మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పీఎంకెఎస్‌వై, జెజెఎం పథకాల స్థితిగతులను పరిశీలించేందుకు కేంద్ర ప్రభుత్వం నోడల్ అధికారి, టెక్నికల్ అధికారులు ఇద్దరు, ఇతర అధికారులతో కూడిన 32 మంది బృందాలు నియమించినట్లు చెప్పారు. దేశంలోని 14 రాష్ట్రాల్లో 61 జిల్లాలో ఈ బృందాలు పర్యటించి ప్రాజెక్టుల పరిస్థితులతో నివేదిక అందిస్తారని తెలిపారు. ప్రాజెక్టు భౌతిక, ఆర్థిక స్థితులు, ప్రాజె క్టు పూర్తి కాక పోవటానికి గల కారణాలు, పెండింగ్ పనుల వివరాలు, నీటి వనరుల వినియోగం, ప్రాజెక్టులో ప్రజలు భాగస్వామ్యం ఇతర అన్ని అంశాలను పరిశీలించి నివేదిక రూపొందిస్తారని తెలిపారు. ఈ నెల 9న బృంద సభ్యులు పరిశీలిస్తారన్నారు. ఆయన వెంట సబ్ కలెక్టర్ శ్రద్ధా శుక్లా, నీటి పారుదల శాఖ ఈఈ ప్రభాకర్, డీఈలు, ఏఈలు పాల్గొన్నారు.

ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేత



ఎస్పీకి పుష్పగుచ్ఛం అందజేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఆసిఫాబాద్, జూన్ 6(ఆంధ్రజ్యోతి): ఆసిఫాబాద్ జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన పాటిల్ కాంతిలాల్ సుభాష్‌ను శుక్రవారం ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు అలీబీన్ అహ్మద్, సంజీవ్, కలాం, పోచయ్య, రవి, సందీప్, లాలా తదితరులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): ఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాష్‌ను శుక్రవారం విద్యుత్ శాఖ జిల్లా సూపరింటెండెంట్ రాథోడ్ శేషారావు మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా అభినందనలు తెలిపారు.

సింగరేణి ఉద్యోగుల పిల్లలకు ప్రాధాన్యం ఇవ్వాలి

శ్రీరాంపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి పాఠశాలల్లో సీబీఎస్ఈ సిలబస్ ప్రవేశపెట్టారని, ప్రవేశాలలో ఉద్యోగుల పిల్లలకు ప్రాధాన్యం ఇవ్వాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం(టీబీజీకేఎస్) అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన ఆధ్వర్యంలో సింగరేణి సీఎండీ ఎన్ బలరాంకు వినతిపత్రం అందించారు. అనంతరం ఆ యన మాట్లాడుతూ ఇప్పటి వరకు సింగరేణి పాఠశాలల్లో చదివే పిల్లలు బయటివారు ఎక్కువగా ఉన్నారన్నారు. నిబంధనల ప్రకారం ప్రవేశాలు కల్పిస్తే సింగరేణి ఉద్యోగుల పిల్లలకు అన్యాయం జరుగుతుందన్నారు. కేవలం 40 శాతం మాత్రమే వారికి అవకాశం లభిస్తుందన్నారు. అంతేకాకుండా గత విద్యాసంవత్సరంలో ఉన్న ప్రవేశాలపై విచారణ జరిపించి న్యాయం చేయాలని కోరారు. ఆయా అంశాలను దృష్టిలో ఉంచుకొని సింగరేణి ఉద్యోగుల పిల్లలు, ఇతరులకు 90:10 నిష్పత్తిలో ప్రవేశాలు కల్పించాలని కోరారు.

ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమి పూజ

బెజ్జూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బెజ్జూరు మండల కేంద్రంలో శుక్రవారం ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనులు సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. అధికారులు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో ఏఈ సాహిల్, కార్యదర్శి వైకుంఠం, కమిటీ సభ్యులు మల్లేష్, షణ్ముఖచారి, శ్రీనివాస్, నగేష్ పాల్గొన్నారు.

ఎస్టీల పదోన్నతుల్లో లోపాలు రాకుండా చూడాలి



మాట్లాడుతున్న ఎస్టీ లైజన్ ఆఫీసర్ కృష్ణయ్య

మందమర్రి టౌన్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థలో పని చేస్తున్న ఎస్టీ ఉద్యోగులకు సంబంధించి పదోన్నతుల్లో లోపాలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత అధికారులపై ఉంటుందని కార్పొరేట్ ఎస్టీ జనరల్ మేనేజర్, చీఫ్ లైజన్ ఆఫీసర్ కృష్ణయ్య అన్నారు. శుక్రవారం ఆయన మందమర్రి జీఎం కార్యాలయంను సందర్శించి ఎస్టీలకు సంబంధించిన రోస్టర్ రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదోన్నతుల విషయంలో ఒకటి రెండు సార్లు అలోచించి అందజేయాలన్నారు. అందులో లోపాలు జరిగితే చర్యలు ఉంటాయని కూడా హెచ్చరించారు. అంబేద్కర్ రిజర్వేషన్ల ప్రకారంగా ఎస్టీలకు సంబంధించిన ఉద్యోగులందరికీ సక్రమంగా పదోన్నతులు కల్పిస్తూ వారి అభివృద్ధికి యాజమాన్యం దోహదపడుతుందన్నారు. జీఎం మాట్లాడుతూ మందమర్రి ఏరియాలో ఒకటికి రెండు సార్లు పరిశీలించిన తర్వాతనే పదోన్నతులు అందజేస్తున్నా మని తెలిపారు. కార్యక్రమంలో పీఎం శ్యాంసుందర్, లైజన్ ఆఫీసర్ జి బాబు, ఇతర అధికారులు ఎ భాస్కర్‌రావు, బి నాగేశ్వర్‌రావు, డి పంతులు, సత్యబోస్, రాజలింగు పాల్గొన్నారు.

ప్రమాదరహిత ఉత్పత్తిని సాధించాలి



మాట్లాడుతున్న జీఎం శ్రీనివాస్, పాల్గొన్న అధికారులు

శ్రీరాంపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగులు ప్రమాదరహిత ఉత్పత్తిని సాధించాలని శ్రీరాంపూర్ జీఎం ఎం శ్రీనివాస్ అన్నారు. ఆర్కే 7 గనిలో ఏర్పాటు చేసిన "ఫాటల్ ఫ్రీ జూన్-2025 ప్రత్యేక భద్రత అవగాహన" సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సంస్థలో పనిచేస్తున్న ప్రతి ఉద్యోగి రక్షణ సూత్రాలను తప్పక పాటిస్తూ ప్రమాదాలను నివారించాలన్నారు. రక్షణ పనిముట్లను వినియోగిస్తూ పని ప్రదేశాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. రక్షణే ప్రథమం... రక్షణే ఎల్లప్పుడూ అనే సూత్రాన్ని తప్పక పాటించాల న్నారు. గతంలో జరిగిన ప్రమాదా లను నివారించి మళ్లీ జరుగకుండా జాగ్రత్త చర్యలు చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఆర్కే 7 గ్రూప్ ఏజెంట్ రాజేందర్, ఏరియా రక్షణాధికారి విజయ్ కుమార్, మేనేజర్ తిరుపతి, రక్షణాధికారి సంతోష్‌రావు, సంక్షేమాధికారి సంతన్, పిట్ కార్యదర్శి సారయ్య, తదితరులు పాల్గొన్నారు.

మారుపేర్లు సవరించాలి

శ్రీరాంపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మారుపేర్లు సవరించాలని గోదావరి లోయ బొగ్గు గని కార్మిక సంఘం(జీఎల్‌బీకేఎస్) వర్కింగ్ ప్రెసిడెంట్ ఐ కృష్ణ కోరారు. ఈ మేరకు ఆ యన ఆధ్వర్యంలో సింగరేణి డైరెక్టర్ (పా) వెంకటేశ్వర్లు, జీఎం(పా) కవితానాయుడు వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, సింగరేణిలో ఏళ్ల తరబడి మారుపేర్ల సమస్య పెండింగ్‌లో ఉందన్నారు. ఇటీవల వచ్చిన సర్క్యులర్ ప్రకారంగా కార్మికులను మెడికల్‌కు పంపకుండా, విజిలెన్స్‌కు రాశారని తెలిపారు. దాదాపు ఐదు నెలలు గడుస్తున్నా వారికి ఇప్పటి వరకు ఉద్యో గ అవకాశం కల్పించలేదన్నారు. సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో యూనియన్ ఉపాధ్యక్షుడు నరేష్ పాల్గొన్నారు.



బెల్లంపల్లి ఏరియాలో పర్యటించిన జీఎం

రెబ్బెన, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బెల్లంపల్లి ఏరియాలో శుక్రవారం జీఎం విజయభాస్కర్ రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా పలువురు జీఎంకు ఘన సన్మానం చేశారు. ఎస్టీ ఉద్యోగాల ఖాళీల భర్తీ, పదోన్నతులకు సంబంధించిన రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎస్ఓటు జీఎం రాజమల్లు, కమిటీ సభ్యులు ప్రసిడెంట్ ఎ.భాస్కర్‌రావు, జనరల్ సెక్రటరి బి నాగేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలి



మాట్లాడుతున్న ఎస్సీ చీఫ్ లైజన్ అధికారి జీఎం రామచందర్

జైపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఎస్టీపీపీ రిక్రూట్‌మెంట్‌లో ప్రమోషన్ పాలసీలో రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలని ఎస్సీ చీఫ్ లైజన్ అధికారి జీఎం (మణుగూరు) రామచందర్ అన్నారు. శుక్రవారం ఎస్టీపీపీలో సింగరేణి ఎస్సీ లైజన్ అధికారుల బృందంతో పర్యటించారు. ఈ సందర్భంగా ఎస్టీపీపీ ఈడీ చిరంజీవి, జీఎం శ్రీనివాసులు అధికారుల బృందానికి పుష్పగుచ్ఛాలు అందించి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో అయన మాట్లాడారు. రిక్రూట్‌మెంట్‌లో తప్పనిసరిగా రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో ఎస్సీ చీఫ్ లైజన్ అధికారులు రాజేశ్వర్, వెంకటేశ్వర్‌రావు, నాగేశ్వర్‌రావు, తిరుపతి, సురేష్, అజాజుల్లాఖాన్, అజ్మీర తుకారాం తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగం రాలేదని ఉరి వేసుకుని యువకుడి ఆత్మహత్య


లహరి ఓం సాయి(ఫైల్)


చెన్నూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : చెన్నూరు పట్టణంలోని ఆదర్శనగర్‌కు చెందిన లహరి ఓం సాయి(25) అనే యువకుడు ఉద్యోగం రాలేదని శుక్రవారం ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు ఎస్‌ఐ వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం లహరి అశోక్-కవితల రెండో కుమారుడు ఓం సాయి డిగ్రీ పూర్తి చేసి కొంత కాలంగా ఖాళీగా ఉంటున్నాడు. ప్రభుత్వ, ప్రైవేటు ఉద్యోగం రాకపోవడంతో మనస్థాపానికి గురైన ఓంసాయి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు తెలిపారు. తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

బీజేపీ మండల కార్యవర్గం



మాట్లాడుతున్న బీజేపీ నాయకులు

వేమనపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : వేమపల్లి మండల కేంద్రంలో శుక్రవారం బీజేపీ మండల అధ్యక్షుడు ఏట మధుకర్ ఆధ్వర్యంలో మండల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా ఉపాధ్యక్షుడు రాపర్తి వెంకటేశ్వర్లు హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి జెండాను ఆవిష్కరించారు. అనంతరం మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. మండల ఉపాధ్యక్షుడిగా ముల్కల సత్యనారాయణ, రమేష్‌గౌడ్, పోచన్న, కావ్యశ్రీ, ప్రధాన కార్యదర్శులుగా ఎనుముల వెంకటేష్, కొప్పుల చరణ్ రాజ్, కార్యదర్శులుగా కొత్తూరి పోచం, మానేపల్లి మాధవి, కోయిల స్వప్న, సంతోష్, కోశాధికారి రాజన్న, కార్యవర్గ సభ్యులుగా మధునయ్య, రాములు, సంతోష్, రాజన్న, రాహుల్, మల్లేష్, సమ్మయ్యలను ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు అజయ్‌కుమార్, కిశోర్, సతీష్, మధునయ్య పాల్గొన్నారు.

పొలానికి బలం.. రైతన్నలకు లాభం



● పచ్చిరొట్ట సాగులో భూసారం బాగు


దండేపల్లిలో రైతు పంటపొలాల్లో సాగు చేసిన జీలుగ

దండేపల్లి, జూన్ 6(ఆంధ్రజ్యోతి): పెట్టుబడి ఖర్చులు తగ్గి, ఆశించిన దిగుబడులు సాధించాలంటే వరి సాగుకు ముందు జీలుగ విత్తనాలు సాగుచేయాలి. తరువాత భూమిలో కలియ దున్నితే భూసారం పెరగడంతో పాటు పంట దిగుబడి ఎక్కువగా వచ్చే అవకాశం ఉందని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. పచ్చిరొట్ట సాగు ద్వారా భూమి సారవంతమవుతుంది, రసాయన ఎరువుల వాడకం తగ్గుతుంది. జీ లుగ, పెసర, అలసంద వంటి కొన్ని రకాల పైర్లను ప చ్చిరొట్ట సాగుకు ఉపయోగిస్తారు. దీంతో తర్వాత వేసే పంటలకు పోషకాల లభ్యత బాగుంటుంది. సాధార ణంగా పచ్చిరొట్ట విత్తనాలను 40రోజులు ముందే సాగు చేయాలి. జీలుగసాగు చేయడం వల్ల పచ్చిరొట్ట ఏర్పడి నేలలు సారవంతమవుతుంది. దీంతో భూసారం పెరగడంతో పంటల్లో అధిక దిగుబడులు వస్తాయి.

● భూమికి మంచి పోషక విలువలు...

ఎకరానికి 15 కిలోల జీలుగ విత్తనాలను వేసవికాలంలో జూన్‌లో పంటపొలాల్లో చల్లుకోవాలి. కొద్దిగా నీటి తడి ఉంటే విత్తనాలు మొలకెత్తుతాయి. 45 రోజులకు మొక్కలు ఏపుగా ఎదిగి పూత దశకు చేరుకుంటాయి. పూతదశకు వచ్చిన జీలుగ చెట్లను నేలలోనే దున్నాలి. జీలుగ పచ్చిరొట్టగా మారి భూమి సారవంతమవుతుంది. భూమిలో పోషక విలువలు పెరిగి వరిపంటలకు మంచి బలాన్ని చేకూరుస్తాయి.

జీలుగను సాగు చేసే విధానం...

ఎకరానికి 10 నుంచి 12 కిలోల జీలుగు విత్తనా లను దుక్కిలో చల్లుకోవాలి లేదా సాళ్లలో విత్తుకో వాలి. మొక్కలు బాగా పెరిగేందుకు సరైన సమయంలో తడి పెట్టాలి. 25నుంచి 30రోజులకు మొక్క లు ఏపుగా పెరిగి, పూత దశకు చేరుకుం టాయి. ఆ సమయంలో రోటోవేటర్ సాయంతో కలియదున్నాలి. అనంతరం సూపర్ ఫాస్పెట్‌ను దుక్కిలో వేయాలి. దీంతో మొక్కల అవశేషాలు బాగా కుళ్లిపోతాయి. కుళ్లే దశలో నీటిని బాగా అందించాలి. కుళ్లి పచ్చిరొట్ట ఎరువులు తయారు అవులాయి.

భూమిలో దున్నుకోవడం ద్వారా చౌడు నివారణతో పాటు సేంద్రియ కర్బనాలను పెంచుకోవచ్చు. జీలుగను రోటి వేటర్‌తో దున్నిన అనంతరం ఎకరానికి రెండు బస్తాల చొప్పున సూపర్‌ను చల్లుకోవాలి. భూమిలోని సూక్ష్మజీవుల సంఖ్య పెరిగి పోషకాల్లో పాలు రాకుండా ఉంటాయి. ఇలా చేయడంవల్ల రసాయన ఎరువుల వేసే అవసరం ఉండదు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో జీలుగ విత్తనాలను 50 శాతం రాయితీపై ప్రతీ యేట రైతులకు అందిస్తున్నారు. ప్రతీ ఖరీఫ్ సీజన్‌కు ముందు నేలలో జీలుగ విత్తనాలను తీసుకుని పంటపొలాల్లో వేసి దున్నుకుంటే పంటలు అధిక దిగుబడి వచ్చి రైతులకు మంచి లాభాలు వస్తాయి.

సబ్సిడిపై జీలుగు, జనుము విత్తనాలు..

ప్రభుత్వం రైతులకు 50శాతం సబ్సిడిపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తుంది. జీలుగు, జనుము విత్తనాలను అందుబాటులో ఉంచింది. జీలుగు 30 కిలోల బ్యాగు ధర రూ. 4,275 ఉండగా సబ్సిడి 50శాతం తీసేయగా రైతులు రూ.2137 చెల్లించాలి. జనుము 40 కిలోల బ్యాగు రూ. 5020 ఉండగా, సబ్సిడి 50శాతం పోగా రైతులు రూ2510 చెల్లించాల్సి ఉంటుంది. జీలుగు, జనుము విత్తనాలను ఎకరాకు 10నుంచి 12కిలోల చల్లుకో వాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. కావాల్సిన రైతులు తమ పట్టాపాసు బుక్, ఆధార్‌కార్డు జిరాక్స్ కాపీతో ఏఈవోలకు వద్ద వెళ్లి విత్తనాలకోసం కుపన్ రాయించుకోని ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం, పీఏసీఎస్ కార్యాలయాలో విత్తనాలు పొందాలన్నారు.


దండేపల్లి ఆగ్రోస్ రైతు సేవ కేంద్రం నుంచి జీలుగు విత్తనాలు తీసుకెళ్తున్న రైతులు

జీలుగ సాగు రైతులకు మంచి లాభదాయకం..



జీలుగ సాగు చేసుకోవడంతో భూమిలో పోషక విలువలు పెగడంతో పంటలు అధిక దిగుబడుల వస్తాయి. వరిపంటకు జీలుగ ఎంతో ఉపకరిస్తుంది. 45 రోజుల్లో జీలుగ పూత దశకు వస్తుంది. దాన్ని అలాగే భూమి లోనే దున్నేస్తే పచ్చరొట్ట ఏర్పడి భూసారం పెరుగుతుంది. జీలుగ విత్తనాలను ఇప్పటికే మండలంలోని అన్ని గ్రామాల రైతులకు సరిపడే విధంగా జీలుగ విత్తనాలను పంపిణీ చేసాం.

- గోర్ల అంజిత్‌కుమార్,
దండేపల్లి వ్యవసాయ శాఖాధికారి..

బియ్యం కోసం బారులు..

(5వ పేజీ తరువాయి)

దుకాణాల్లో బియ్యం పంపిణీ జరుగుతుంది. అలా ఒక్కో షాపుల పరిధిలోని లబ్ధిదారులకు పంపిణీ చేసేందుకు సమయం అనుకూలంగా ఉంటుంది. కానీ పాతగడువు ప్రకారమే మూడు నెలల బియ్యం పంపిణీ చేయాలంటే సమయం సరిపోదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. నిర్ణీత 15 రోజుల సమయమే కాకుండా అదనంగా మరో పది రోజులు పెంచాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అలాగే పోర్టబుల్ సిస్టం ద్వారా ఇబ్బందులు తలెత్తే అవకాశాలు ఉన్నట్లు డీలర్లు వాపోతున్నారు. పోర్టబుల్ సిస్టం పద్ధతిలో మరో గ్రామానికి చెందిన రేషన్‌కార్డుల లబ్ధిదారులకు వారు కోరుకున్న చోట బియ్యం పంపిణీ చేయాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఎంత మంది ఇతరులు బియ్యం తీసుకుంటారో తెలియని పరిస్థితుల్లో అసలు లబ్ధిదారులకు ఉన్న స్టాక్ నుంచి అందుతాయా లేదా అన్న సందేహం నెలకొంది. దీనికి గాను ఇతర ప్రాంతాలకు చెందిన వారికి పంపిణీ చేసేందుకు అదనపు బియ్యం కేటాయించాలనే విజ్ఞప్తులు ఉన్నాయి. లేని పక్షంలో అసలు లబ్ధిదారులకు కొరత ఏర్పడి గొడవలు జరిగే అవకాశాలు ఉన్నట్లు లబ్ధిదారులు వాపోతున్నారు. ఈ విషయమై అధికారులు దృష్టి సారించి నిర్ణీత కోటాకం టే అదనపు బియ్యం సరఫరా చేయాలని కోరుతున్నారు. మరోవైపు ఎంఎల్‌ఎస్ పాయింట్ నుంచి సరఫరా అయ్యే 50 కేజీల బస్తాలో కొన్ని సందర్భాల్లో 40 కేజీలు, ఆ పైన వస్తుండడంతో బియ్యం కొరత ఏర్పడుతుందని తెలుస్తోంది. ఎంఎల్‌ఎస్ పాయింట్ల వద్దనే సరైన తూకం వేసి బియ్యం సరఫరా చేయాల్సి అవసరం ఉంది.

రహదారుల నిర్మాణాలకు అటవీ శాఖ అనుమతులు ఇప్పించాలని వినతి


ఎంపీ అరుణకు వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎంపీపీ సురేఖ

కోటపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పలు రహదారుల నిర్మాణానికి అటవీ శాఖ అనుమతులు ఇప్పించాలని కోరుతూ శుక్రవారం పార్లమెంట్ సభ్యురాలు డీకే అరుణకు వినతి పత్రం అందించినట్లు మండల మాజీ ఎంపీపీ మంత్రి సురేఖ, బీజేపీ మండల ఉపాధ్యక్షుడు మంత్రి రామయ్య తెలిపారు. రహదారుల నిర్మాణానికి అటవీ శాఖ క్లియరెన్స్, ఈజీఎస్ నిధుల కోసం కేంద్రం దృష్టికి తీసుకువెళ్లి సమస్యలను పరిష్కరించేలా కృషి చేయాలని వినతి పత్రంలో కోరారు. కేంద్ర ప్రభుత్వం పరిధిలో సమస్య పెండింగ్ ఉంటే క్లియర్ చేయిస్తానని డీకే అరుణ హామీ ఇచ్చినట్లు మాజీ ఎంపీపీ వివరించారు.

ఎమ్మార్పీఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశం

మంచిర్యాలకలెక్టరేట్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని చార్వాక హాల్‌లో ఎమ్మార్పీఎస్, దాని అనుబంధ సంఘాల ఆధ్వర్యంలో ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్‌చార్జి శ్రీనివాస్ మాదిగ మాట్లాడుతూ మందకృష్ణ మాదిగ ఆదేశాల మేరకు రేపటి నుంచి నూతన గ్రామ, మండల నిర్మాణం చేపడతామన్నారు. ఇక నుంచి ఎమ్మార్పీఎస్ ఉద్యమం లేని గ్రామం లేకుండా చేయాలన్నారు. జూలై 7న ప్రతి గ్రామం, మండలంలో నూతన జెండాలు ఆవిష్కరించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు చిన్న రాజన్న మాదిగ, మంతెన మల్లేష్, చుంచు శంకర్‌వర్మ మాదిగ, చిప్పకుర్తి సతీష్ మాదిగ, చిప్పకుర్తి మల్లేశ్ మాదిగ, శంకర్ మాదిగ, దశరథం మాదిగ పాల్గొన్నారు.

ఆత్మ చైర్మన్‌గా ఓడేటి హన్మంతు



హన్మంతును సన్మానిస్తున్న అధికారులు, నాయకులు

నెన్నెల/కన్నెపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : భీమిని డివిజన్ వ్యవసాయ సాంకేతిక యాజమాన్య సంస్థ (ఆత్మ) చైర్మన్‌గా కన్నెపల్లి మండలం నాయి కనిపేట గ్రామానికి చెందిన ఓడేటి హన్మంతును ఎన్నుకున్నారు. నెన్నెల రైతువేదికలో శుక్రవారం ఏడీఏ సురేఖ అధ్యక్షతన నెన్నెల, భీమిని, కన్నెపల్లి, వేమనపల్లి మండలాల రైతు సలహాసంఘాల సమావేశం నిర్వహించారు. డివిజన్ ఆత్మ చైర్మన్‌గా హన్మంతును ఏకగ్రీవంగా ఎన్నుకోగా అధికారులు అమోదించారు. ఈ సందర్భంగా హన్మంతు మాట్లాడుతూ వ్యవసాయ కుటుంబం నుంచి వచ్చిన తనకు రైతులకు సేవ చేసుకునే భాగ్యం కలిగిందన్నారు. ఆత్మ ద్వారా శాస్త్రసాంకేతిక రంగాల్లో విలువైన సలహాలు, సూచనలు అందేలా కృషి చేస్తానన్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, అధికారులు హన్మంతును ఘణంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారులు సృజన, వీరన్న, ప్రశాంత్, యమునా కాంగ్రెస్ పార్టీ నాయకులు హరీష్‌గౌడ్, మల్లేష్, మల్లాగౌడ్, లక్ష్మినారాయణ పాల్గొన్నారు.

ఘనంగా ఎమ్మెల్యే పెళ్లిరోజు వేడుకలు

మందమర్రి టౌన్, జూన్ 6(ఆంధ్రజ్యోతి) : చెన్నూరు ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి సరోజ దంపతుల పెళ్లి రోజు సందర్భంగా శుక్రవారం పట్టణంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆలయాల్లో పూజలు నిర్వహించడంతో పాటు కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. స్థానిక మార్కెట్ సెంటర్‌లోని అంజనేయ స్వామి ఆలయంలో దంపతుల పేరిట అర్చనలు చేయించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. అదే విధంగా పంచముఖ అంజనేయ స్వామి ఆలయంలో మరో గ్రూపు వారు పూజలు నిర్వహించారు.

రెవెన్యూ సదస్సులో గొడవ

బెల్లంపల్లి, జూన్6(ఆంధ్రజ్యోతి): మండలంలోని చంద్రవెల్లి గ్రామంలో శుక్రవారం తహసీల్దార్ క్రిష్ణ ఆధ్వర్యంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతులు ఒకరిపై ఒకరు దాడి చేసుకున్నారు. చంద్రవెల్లి గ్రామానికి చెందిన రాజుకుమార్, రమేశ్ అనే ఇద్దరు రైతులు ఒకే భూమి విషయంలో రెవెన్యూ సదస్సులో దరఖాస్తులు చేసుకునేందుకు వచ్చారు. ఈ క్రమంలో విక్రయించిన భూమిపై మళ్లీ దరఖాస్తు చేసుకునేందుకు ఎందుకు వచ్చావని రమేశ్ అనే రైతుతో రాజుకుమార్ అడిగాడు. దీంతో మాటమాట పెరిగి ఇద్దరు ఒకరిపైఒకరు దాడికి చేసుకున్నారు. ఈ క్రమంలో రెవెన్యూ ఇరు వర్గాలు సముదాయించి అక్కడి నుంచి పంపించారు. ఈ విషయంపై తహసీల్దార్ క్రిష్ణను వివరణ కోరగా రమేశ్ తండ్రి మృతి చెందడంతో విరాసత్ కోసం దరఖాస్తు చేసుకోవడానికి వచ్చిన క్రమంలో ఇరువర్గాల మధ్య గొడవ జరిగినట్లు తెలిపారు.

నెన్నెలలో రెండు వర్గాలు

నెన్నెల : జెండావెంకటాపూర్‌లో శుక్రవారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో కాంగ్రెస్ నాయకులు రెండు వర్గాలుగా ఏర్పడి గొడవపడ్డారు. ఇందిరమ్మ ఇళ్లు అనర్హులకు మంజూరు చేశారని ఓ వర్గం వారు మరో వర్గం వారితో వాగ్వాదానికి దిగారు. మాటామాట పెరిగి తోపులాడుకున్నారు. కుర్చీలను ఎత్తి పడేయడంతో విరిగిపోయాయి. పెనుగులాటలో గోగు సుధాకర్ అనే నాయకుడు స్వల్పంగా గాయ పడ్డాడు. అతడికి కంటిపక్కన గాయమైంది. సీనియర్ నాయకులు కల్పించుకొని సర్దిచెప్పారు. సుధాకర్‌ను బెల్లంపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం తను పోలీసులకు ఫిర్యాదు చేస్తానని సుధాకర్ పేర్కొన్నాడు.

విద్యార్థుల సంఖ్యను పెంచడమే బడిబాట లక్ష్యం



భీమినిలో బడిబాట కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి యాదయ్య

భీమిని, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేస్తూ విద్యార్థుల సంఖ్యను పెంచడమే లక్ష్యంగా ప్రభుత్వం ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని డీఈవో యాదయ్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో నిర్వహించిన బడిబాట గ్రామసభ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో విద్య లభిస్తుందన్నారు. ఐదేళ్లు నిండిన ప్రతీ ఒక్కరిని ప్రభుత్వ పాఠశాల ల్లో చేర్పించేలా కృషి చేయాలన్నారు. ప్రతీ ఒక్కరూ సమన్వయంతో పని చేస్తూ బడిబాటను విజయవంతం చేయాలన్నారు. ఈ నెల 6 నుంచి 19 వరకు నిర్వహించే కార్యక్రమాలపై ఉపాధ్యాయులకు అవగాహన కల్పించారు. జూన్ 19న బడిబాట ముగింపు సందర్భంగా విద్యార్థులకు వివిధ క్రీడాపోటీలను నిర్వహించాలన్నారు. అనంతరం భీమిని జిల్లా పరిషత్ పాఠశాలలో వసతులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో కృష్ణమూర్తి, సెక్టోరియల్ అధికారి చౌదరి, ఎంపీడీవో గంగా మోహన్, ఎస్సై విజయ్ కుమార్, ప్రధానోపాధ్యాయుడు వెంకట స్వామి, భారతమాత మండల సమాఖ్య అధ్యక్షురాలు విమల, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వేమనపల్లి : మండలంలోని గ్రామాల్లో బడీడు పిల్లలను ప్రభుత్వ బడుల్లో చేర్పించాలని ఎంఈవో శ్రీధర్ రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేమనపల్లి ప్రభుత్వ పాఠశాలలో అంగన్‌వాడీ టీచర్లు, పంచాయతీ కార్యదర్శులు, ఏపీపీసీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. బడిబాట కార్యక్రమంలో బడీడు పిల్లలను గుర్తించాలన్నారు. ఉపాధ్యాయులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

కన్నెపల్లి : కన్నెపల్లిలో శుక్రవారం జిల్లాపరి షత్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమేష్ ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, స్థానికులు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్ : మండలంలోని పొన్నారం, వెంకటాపూర్ గ్రామాల్లో శుక్రవారం ఎంఈవో దత్తు మూర్తి ఆధ్వర్యంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని తల్లిదండ్రులను కోరారు. ప్రభుత్వ పాఠశాలల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కోటపల్లి : బడీడు పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. గ్రామాల్లో జరిగిన బడిబాట కార్యక్రమాన్ని ఎంఈవో పరిశీలించారు. పీఆర్‌టీయూటీఎస్ జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్, ఎంఆర్‌పీ సంపత్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జన్నారం: ఎంఈవో విజయ్‌కుమార్ ఆధ్వర్యంలో మండల ఉపాధ్యాయులకు సమావేశం నిర్వహించారు. అనంతరం మండల కేంద్రంలో బడిబాట కార్యక్రమాన్ని ర్యాలీ నిర్వహించారు. ప్రతి గ్రామంలో విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించే విధంగా ఉపాధ్యా యులతో పాటు వారి తల్లిదండ్రులు కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

దండేపల్లి: ప్రైవేటు పాఠశాల ధీటుగా ప్రభుత్వ పాఠశాలల్లోనే మంచి విద్యాను అందిస్తున్నామని పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చదివించాలని మండలంలోని అన్ని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాల, గిరిజన ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యయలు, ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులను సూచించారు.

బడిబాట కార్యక్రమంలో భాగంగా శుక్రవారం మండలంలో ఆయా పాఠశాల ఉపాధ్యాయులు ర్యాలీ చేపట్టి ఇంటింటికీ తిరుగుతూ విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడారు. ఈ ప్రచారంలో ఆయా పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం అందజేత

మంచిర్యాలక్రైం, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో గాయపడి కోలుకుంటున్న దుగ్యాల తిరుపతి హోంగార్డు కుమారుడు అరుణ్‌కు పోలీసు డిపార్టమెంట్ తరుపున ఆర్థిక సాయాన్ని అందజేశారు కరీంనగర్‌లో చికిత్స పొందుతున్న ఆయనను పరామర్శించి ఎమ్ టీవింగ్ నుంచి 27,500, ఏఆర్ విభాగం నుంచి 32వేలు, ఉమ్మడి కరీంనగర్ జిల్లా 17,500, ఆర్‌ఐ మల్లేశం నుంచి 3వేలు మొత్తం రూ.80వేలను ఆర్థిక సాయం అందజేశారు. అందజేసిన వారిలో సిబ్బంది ఆర్‌ఐ మల్లే శంతో పాటు మైకాంత్, రాజయ్యలు ఉన్నారు.

పంటల సాగుపై అవగాహన

తాండూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ద్వారకాపూర్ గ్రామంలో శుక్రవారం రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో భాగంగా పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బెల్లంపల్లి కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త స్రవంతి, నాగరాజులు పలు విషయాలపై అవగాహన కల్పించారు. తక్కువ యూరియా వాడడం, సాగు ఖర్చును తగ్గించడం, అవసరం మేరకు రసాయనాలను వినియోగించడం, విత్తనాలు, ఎరువులు కొన్న రశీదులను భద్ర పర్చుకోవడం, సాగునీటిని ఆదా చేయడం, చెట్లను పెంచడం, సేంద్రీయ ఎరువుల వాడకం తదితర అంశాలపై అవగా హన కల్పించారు. ఆయిల్‌ఫాం సాగు గురించి రైతులకు వివరించారు. కార్యక్రమంలో బెల్లంపల్లి డివిజన్ వ్యవసాయసంచా లకులు రాజానరేంద్ర, మం డల వ్యవసాయాధికారి సుష్మ, ఆయిల్‌ఫాం కంపెనీ మ్యాట్రిక్స్ సీఈవో ఉదయ్‌కుమార్, ఏఈ వో శంకర్, రైతులు పాల్గొన్నారు.

భూసమస్యలపై దరఖాస్తులు చేసుకోవాలి


జైపూర్‌లో భూ భారతి సదస్సులో దరఖాస్తులను స్వీకరిస్తున్న డిప్యూటీ తహసీల్దార్

జైపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : రైతులకు, ప్రజలకు ఉన్న అనేక రకాలైన భూ సమస్యలను రెవెన్యూ భూభారతి సదస్సుల్లో దరఖాస్తులు చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ సంతోష్‌కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో భూభారతి సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ భూ సమస్యలుంటే స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేశామని, భూ సమస్యలున్న వారు ఉపయోగించుకోవాలన్నారు. మండలంలోని అన్ని గ్రామాల్లో భూ భారతి రెవెన్యూ సదస్సులు జరుగుతున్నాయని, భూసమస్యలున్న వారు దరఖాస్తులను అందజేయాలన్నారు. మండల సర్వేయర్ రామస్వామి, జూనియర్ అసిస్టెంట్ స్వామి, విజయ్‌కు మార్, పంచాయతీ కార్యదర్శి ఉదయ్‌కుమార్, ప్రసన్నలు పాల్గొన్నారు.

మందమర్రిరూరల్: మామిడిగట్టు, వెంకటాపూ ర్ గ్రామాల్లో శుక్రవారం భూ భారతి రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. తహసీల్దార్ సతీష్‌కుమార్ , పంచాయతీ కార్యదర్శులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దండేపల్లి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూభారతి చట్టం ద్వారా రైతుల భూములకు భద్రత లభిస్తుందని తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే అన్నారు. శుక్రవారం మండలంలోని రెబ్బనపల్లి, గుడిరేవులో రైతుల వద్ద నుంచి దరఖాస్తులు స్వీకరించారు. రైతులకు భూహక్కులను కల్పించడమే ప్రభుత్వ లక్ష్యమన్నారు. భూభారతి చట్టం, సాదా బైనామా, పీవోటీ, భూ విస్తీర్ణంలో మార్పులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ విజయ, సీనియర్ అసిస్టెంట్ లావణ్య, ఆర్‌ఐ భూమన్న, సిబ్బంది పాల్గొన్నారు.

కొనసాగుతున్న రిలే దీక్ష

నస్పూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : తీగల్‌పహాడ్ గోదాముల వద్ద కోల్ బెల్ట్ ఏరియా లారీ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ యజమానులు చేపట్టిన నిరహార దీక్ష శుక్రవారం నాటికి ఐదవ రోజుకు చేరింది. అధికారులు తమ సమస్యల పరిష్కారించడంలో నిర్లక్ష్యం చేస్తున్నారని లారీ యాజమానులు ఆరోపించారు. ఐదవ రోజు దీక్షలో గుండా సురేశ్ గౌడ్, బాస్కర్ల సుమన్, రాందేని రమేశ్, రమేశ్, తిరుపతి, రాజేశ్, ఉపేందర్‌రావు, రమేష్‌రెడ్డి, సదానందం కూర్చున్నారు.

ఆటో స్టాండ్ స్థలం ఇతరులకు కేటాయించవద్దు

బెల్లంపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద ఎన్నో ఏళ్లుగా ఆటో స్టాండ్ ఏర్పాటు చేసుకొని ప్రయాణికులను చేరవేస్తున్నామని ఈ స్థలాన్ని ఇతరులకు కేటాయించవద్దని కోరుతూ శుక్రవారం ఆటో యూనియన్ సంఘం ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు బెల్లంపల్లి ఆర్డీవో కార్యాలయంలోని ఏవోకు వినతి ప్రతం అందజేశారు. సింగరేణి అధికారులు గత పదేళ్ల క్రితం ఆటో స్టాండ్ కోసం స్థలం కేటాయించారని పేర్కొన్నారు. వివిధ మండలాలకు సంబంధించిన ప్రయాణికులను ఆటో స్టాండ్ నుంచి ప్రతి రోజు వారి గమ్య స్థానాలకు చేరుస్తున్నామన్నారు. రెండు రోజుల క్రితం ఆర్డీవో ఆటోస్టాండ్ స్థలాన్ని పరిశీలించి సేవా సంస్థల వారికి కేటాయిస్తామని చెప్పడం సరైంది కాదన్నారు. స్థానిక అధికారులు ఆటో డ్రైవర్లకు న్యాయం చేయకపోతే జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ జిల్లా జేఏసీ అధ్యక్షులు కట్టకుమార్‌తో పాటు పెద్ద ఎత్తున ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

మందమర్రిరూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుర్కపల్లి తదితర గ్రామాల్లో శుక్రవారం ఎంపీడీవో రాజేశ్వర్ ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు భూమిపూజ చేశారు. ప్రభుత్వం అర్హులైన వారందరికి ఇళ్లు అందిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ

జన్నారం, జూన్6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బాదంపల్లి గ్రామంలో గల జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన 9 మంది విద్యార్థులు జాతీయ ఎన్‌ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌లకు ఎంపికై జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచారని ఎంఈవో విజయ్ కుమార్ తెలిపారు. ప్రతి సంవత్సరం జన్నారం మండలానికి చెందిన విద్యార్థులు జిల్లాలో మొదటి స్థానంలో నిలుస్తారని, ఈసారి బాదంపల్లి విద్యార్థులు ఎంపికవడం హర్షనీయమన్నారు. ఒక్కో విద్యార్థికి సంవత్సరానికి 12వేల చొప్పున నాలుగు సంవత్సరాలకు 48వేల స్కాలర్‌షిప్‌లు వస్తాయన్నారు. వీరిని పాఠశాల ప్రదానోపాధ్యాయులు జాడి ప్రభాకర్‌తో పాటు ఏఏపీసీ చైర్మన్ స్వప్న, ఉపాధ్యాయ బృందంతో పాటు గ్రామస్తులు అభినందించారు.



సాగు భారం..



- పెరుగుతున్న పెట్టుబడులు
- ట్రాక్టర్ కిరాయిలు, కూలీల రేట్లు పెంపు
- ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయని ఆందోళన
- విత్తడానికి ముందే రైతులు దిగాలు

రైతులకు సాగు భారంగా మారుతోంది. డీజిల్, ఎరువులు, విత్తనాల ధరలు, కూలీల రేట్లు పెరిగిపోతున్నాయి. దీంతో సాగు ఖర్చులు తడిసి మోపెడవుతున్నాయి.

ఆసిఫాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): అన్నదాతలకు ఏటా పెట్టుబడి భారంగా మారుతోంది. రోజు రోజుకి పెరుగుతున్న ఇంధన ధరలతో అన్నదాత లకు దిగులు పట్టుకున్నది. ట్రాక్టర్లు, యంత్రాల కిరాయిలు తడిసి మోపడవుతుండడంతో పెట్టుబడులు పెరిగి వ్యవసాయం చేయలేని పరిస్థితి నెలకొన్నది. ఒకప్పుడు పల్లెల్లో ఇళ్ల ఎదుట కాడెద్దులు, పశువులు, వ్యవసాయ సామగ్రి కనిపించేవి. కాలక్రమేనా ఎడ్ల పోషణ భారంగా మారడం, కూలీలు దొరక్క పోవడం, కూలీ రేట్లు ఎక్కువ కావడంతో సేద్యపు ఎడ్లు, పని ముట్ల స్థానాన్ని ట్రాక్టర్లు, యంత్రాలు ఆక్రమించాయి. ఇప్పుడు కాడెద్దులు కరువయ్యాయి. దుక్కిదున్నడం మొదలు పంట కోత వరకు, మందుల పిచికారి కోసం కూడా యంత్రాల పైనే ఆధారపడక తప్పడంలేదు. నిత్యం పెరుగుతున్న డీజిల్ ధరలు ఇప్పుడు రైతులకు అదనపు భారంగా మారుతున్నాయి. రైతులు పాత పద్ధతుల్లో సాగు చేయలేక కొత్త పద్ధతులు అందుకో లేక సతమతమవుతున్నారు. చిన్న, సన్నకారు రైతులకు మరీ ఇబ్బందికరంగా ఉంది.

4.45లక్షల ఎకరాల్లో పంటల సాగు

జిల్లాలో ఈ వానకాలం సీజన్‌లో దాదాపు 4.45 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగయ్యే అవకాశ మున్నదని వ్యవసాయ శాఖాధికారులు అంచనా వేశారు. పత్తి, కంది, వరి, మొక్కజొన్న, కూరగాయలు రైతులు ఎక్కువగా సాగు చేయనున్నారు. ప్రభుత్వాలు ఒక వైపు యాంత్రీకరణ వైపు దృష్టి సారించాలని సూచిస్తుండగా రోజు రోజుకు పెరుగుతున్న పెట్రోల్, డీజిల్ ధరలు రైతుల నడ్డి విరుస్తోంది. దీంతో రైతులు సాగు విషయంలో మల్లగుల్లాలు పడుతున్నారు. నేల తల్లిని నమ్ముకుని అన్నదాతలు ఏటా వ్యవసాయంలో నష్టాలే చవి చూస్తున్నారు. దుక్కులు దున్నడం మొదలుకుని పంటలు చేతికి వచ్చేంత వరకు యంత్రాలతోనే పనులు చేయించాల్సి రావడంతో ఖర్చులు పెరిగిపోయాయి.

దుక్కిదున్నడం మొదలు..

సీజన్ ప్రారంభంలో దుక్కి దున్నడం మొదలు పంట చేతికి వచ్చి మార్కెట్‌లో విక్రయిం చేదాక అన్న దాతలు పెట్టుబడులు పెట్టాల్సిందే. చాలా మంది రైతులు ఇప్పటికే యాంత్రీకరణపై ఆధారపడుతున్నారు. ట్రాక్టర్‌తో దుక్కి దున్నించడానికి పనిని బట్టి గంటకు కిరాయి తీసుకుంటున్నారు. కల్టీవేటర్‌కు, డిస్కులతో దున్నితే, రోటోవేటర్, ప్లవ్ వేసేందుకు చార్జీ లు పెరిగిపోయాయి. ఎకరం భూమి దున్ని పత్తి, మొక్కజొన్న సాగు చేసేందుకు రూ.10 వేల వరకు ఖర్చవుతుంది. డీజిల్ ధరలు పెరగడంతో ట్రాక్టర్ల చార్జీలు పెరిగాయని రైతులు వాపోతున్నారు. గడిచిన వానాకాలం, యాసంగితో పోలిస్తే ఈ ఏడాది మరింత ఖర్చులు పెరిగిపోతున్నాయని రైతులు చెబుతున్నారు.

ఖర్చులు బాగా పెరిగాయి..
సంతోష్, రైతు, ఆసిఫాబాద్



సాగు ఖర్చులు బాగా పెరిగాయి. డీజిల్ ధరలతో పాటు కూలి ధరలు పెరగడంతో వ్యవసాయం చేయ లేక పోతున్నాం. 10 ఎకరాల్లో పత్తి సాగు చేస్తున్నాను. ట్రాక్టర్ దున్నడానికి, ఇతర పనులకు ఎనభై నుంచి తొంభై వేలకు పైగా ఖర్చు అవుతున్నది. మరో వైపు కూలి రేట్లు పెరిగాయి. పండించిన పంటకు మద్దతు ధరను నామమాత్రంగా పెంచుతున్నారు. వ్యవసాయం చేయడం భారంగా మారుతోంది.

ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యం
ఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాష్



మాట్లాడుతున్న ఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాష్

ఆసిఫాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రజల భద్రత, రక్షణే ప్రధాన లక్ష్యమని జిల్లా ఎస్పీ పాటిల్ కాంతి లాల్ సుభాష్ అన్నారు. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజ లకు పోలీసులు నిరంతరం అందు బాటులో ఉంటూ చట్ట పరిధిలో ప్రజల సమస్యలను పరిష్కారం చేస్తామన్నారు. జిల్లాలో శాంతి పరిరక్షణలో భాగంగా తీసుకోవాల్సిన చర్యలు, నేరాల నియం త్రణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. డయల్ 100 ద్వారా వచ్చినటువంటి ఫోన్ కాల్స్‌కి వేగంగా స్పందించి నేరాన్ని నియంత్రించాలన్నారు. సైబర్ నేరాలకు కట్టడికి తీసుకోవాల్సిన చర్యల గురించి జిల్లాలో నిషేధిత మత్తు పదార్థాల నియంత్రణకు, అసాంఘీక కార్యకలాపాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించారు. మావోయిస్టు నియంత్రణ కోసం జిల్లాలో ఎప్పటికప్పుడు స్పెషల్ పార్టీ ద్వారా ఏరియా డామినేషన్, కూంబింగ్ నిర్వహించాలన్నారు. సామాన్యుడిని దృష్టిలో పెట్టుకొని వారికి భరోసా కలిగించే విధంగా పోలీసింగ్ ఉండాలన్నారు. శాంతి భద్రతల విషయంలో కఠినంగా వ్యవరించాల చెప్పారు. శాంతి భద్రతలకు, పోలీసుల విధులకు భంగం కలిగించే వారిపై చట్టపరమూన చర్యలు తీసుకోవాలన్నారు. బక్రీద్ పండగ సందర్భంగా అవాంఛ నీయ సంఘటనలు జరగకుడా ప్రతి పోలీసు స్టేషన్ పరిధిలో సరిపడా బందో బస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. భద్రత పకడ్బందీగా చేపట్టాలని సూచించారు. సమావేశంలో ఏఎస్పీ చిత్తరంజన్, డీఎస్పీ రామానుజం, సీఐలు ప్రతాప్, ఆర్‌ఐలు, ఎస్సైలు, ఆర్‌ఎస్సైలు, ఇతర పోలీసు అధికారులు తదితరులు పాల్గొన్నారు. కాగా ఎస్పీ పాటిల్ కాంతిలాల్ సుభాష్‌ను శుక్రవారం జిల్లా అటవీ అధికారి నీరజ్‌కుమార్ టిబ్రేవాల్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లాలోని పలు అంశాలపై చర్చించారు.

కలెక్టరేట్ ఎదుట బీఆర్ఎస్ నాయకుల ఆందోళన



ఆందోళన చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి, బీఆర్ఎస్ నాయకులు

ఆసిఫాబాద్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో అధికారులు ప్రొటోకాల్ విస్మరిస్తున్నారని శుక్రవారం కలెక్టరేట్ ఎదుట ఎమ్మెల్యే కోవ లక్ష్మి బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ నియోజకవర్గంలో తనకు కనీస సమాచారం లేకుండా ఎటువంటి ప్రొటోకాల్ లేని కాంగ్రెస్ నాయకులు ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్నారన్నారు. ఎలాంటి అర్హతలేని కాంగ్రెస్ పార్టీ నాయకులతో ఇందిరమ్మ లబ్ధిరులకు ప్రొసిడింగ్స్ ఇస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల ప్రారంభోత్సవానికి సమాచారం ఇవ్వకుండా అధికారులు ప్రొటోకాల్‌ను విస్మరిస్తున్నా రని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసీ మహిళ ఎమ్మెల్యేనైన తనపై ఈ విధంగా చిన్న చూపు చూడడం సరికాదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్దిదారుల ఎంపికలో తీవ్ర అవకతవకలు జరిగాయని చెప్పారు. అర్హులక కాకుండా కాంగ్రెస్ పార్టీ నాయకులకు కార్యకర్తలకు ఇళ్లకు కేటాయిస్తున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. ప్రొటోకాల్ పాటించని అధికారులపై చర్యలు తీసుకోవాలని సుమారు మూడు గంటల పాటు బైఠాయించారు. అదనపు కలెక్టర్ డేవిడ్, ఆర్డీవో లోకేశ్వర్‌రావులు అక్కడికి వెళ్లి పూర్తి విచా రణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ అలీబీన్ అహ్మద్, కార్నాథం సంజీవ్ బీఆర్ఎస్ నాయకులు జాబిరె రవిందర్, బుర్స పోచయ్య, సందీప్, ఇంతియాజ్ లాలా, నిసార్, అహ్మద్, దూడల అశోక్, శ్రీధర్‌రెడ్డి, కిష్టయ్య, బలరాం, బీమేష్ తదితరులు పాల్గొన్నారు.

దురుసుగా ప్రవర్తించిన కేసులో ఒకరి రిమాండ్

బెజ్జూరు, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): పోలీసులతో దురుసుగా ప్రవర్తించిన ఓ వ్యక్తికి 14 రోజుల పాటు సిర్పూర్(టి) కోర్టు రిమాండ్ విధించింది. మండలంలోని బొగుడగూడ గ్రామానికి చెందిన గోమాస నారాయణ అతని కుమారుడు దీపక్ గురువారం రాత్రి పోలీసులతో దురుసుగా ప్రవర్తించడంతో ఎస్సై ప్రవీణ్‌కుమార్ కేసు నమోదు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు. శుక్రవారం కోర్టులో హాజరు పరిచారు. నారాయణకు 14 రోజుల పాటు రిమాండ్ విధించారు. కొడుకు మైనర్ కావడంతో తల్లి కోరిక మేరకు ఆమె పూచీకత్తుతో విడిచి పెట్టారు.

కొనసాగుతున్న పోడు రైతుల నిరసన



పోడు రైతులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కోనప్ప

చింతలమానేపల్లి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దిందా గ్రామ పోడు రైతులు రెండో రోజు నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. రాత్రి వేళల్లో సైతం తమ చంటి బిడ్డలతో అక్కడే బైఠాయించారు. గత కొన్ని ఏళ్లుగా సాగు చేసుకుంటున్న తమ భూములను ఎట్టి పరిస్థితుల్లో వదులుకునేది లేదని ఉన్నతాధికారులు, రాష్ట్ర ప్రభుత్వం వెంటనే తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం చేసే వరకు ఇక్కడి నుంచి లేచేది లేదని ఇక్కడే వండుకొని ఇక్కడే ఉంటామని చెబుతున్నారు. కాగా వీరికి మాజీ ఎమ్మెల్యే కోనేరు కోనప్ప మద్దతు తెలిపారు. రైతుల పక్షాన తామెప్పుడు అండగా ఉంటామని ఈ సందర్భంగా ఆయన హామీ ఇచ్చారు. అయితే అటవీ శాఖ అధికారులు సైతం అడవి భూమిని రక్షించుకునే క్రమంలో ఎఫ్ఆర్వో ఇక్బాల్ ఆధ్వర్యంలో సుమారు 50 మంది వరకు అధికారులను మొహరించి అక్కడే వంటావార్పు చేస్తున్నారు. కార్యక్రమంలో పోడు రైతులు, నాయకులు వెంకయ్య, నాజీంహుస్సేన్, శీను, నారాయణ పాల్గొన్నారు.

బీజేపీ మండల కార్యవర్గం

లింగాపూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బీజేపీ మండల కార్యవర్గాన్ని శుక్రవారం ఎన్నుకున్నామని మండల అధ్యక్షుడు ఆడే సురేష్ అన్నారు. మండల ప్రధాన కార్యాదర్శిగా ఆడే అశ్విన్, జాదవ్ సచిన్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా జాదవ్ హిరామన్, అత్రం హనుమంత్‌తరావు, రాహుల్, అనితను ఎన్నుకున్నారు. కార్యాదర్శులుగా నరేష్, లచ్చు, గంగాదేవిలను ఎన్నుకున్నామని మండల అధ్యక్షుడు తెలిపారు.

భూ సమస్యల శాశ్వత పరిష్కారమే ధ్యేయం



సింగారావుపేటలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ డేవిడ్

ఆసిఫాబాద్ రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం చేపట్టిన భూభారతి ద్వారా భూ సమస్యలు శాశ్వతంగా పరిష్కారమే ధ్యేయంగా రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని అదనపు కలెక్టర్ డేవిడ్ అన్నారు. శుక్రవారం జిల్లాలోని ఆసిఫాబాద్ మండలం సింగారావుపేట గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన రెవెన్యూ సదస్సును సందర్శించి దరఖాస్తుల ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన భూ భారతి చట్టం ద్వారా భూముల సమస్యలకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని అన్నారు. రైతులు రెవెన్యూ సదస్సులను సద్విని యోగం చేసుకోవాలని తమ భూముల సమస్యల పై వివరంగా దరఖాస్తులు సమర్పించాలని, రికార్డుల ను సరి చేసి క్షేత్రస్థాయిలో పరిశీలించి సమస్యను త్వరగా పరిష్కరించడం జరుగుతుందని తెలిపారు. రెవెన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను కేటగిరీల వారిగా రిజిస్టర్ల నమదు చేసి వెంటనే ఆర్‌లైన్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు. దర ఖాస్తుతో పాటు భూమికి సంబంధించిన పత్రాలను జత పరిచినట్లయితే త్వరగా పరిష్కరించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ రియాజ్ అలీ, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): సిర్పూర్(టి) మండలంలో రెవెన్యూ సదస్సులు కొనసా గుతున్నాయి. శుక్రవారం టోకని, పారిగాం, లక్ష్మీపూర్ తదితర గ్రామాల్లో తహసీల్దార్ రహీముద్దీన్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. పరిశీలించి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): భూ సమస్యల పరిష్కారం కోసం గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నామని తహసీల్దార్ రామ్మోహన్ అన్నారు. శుక్రవారం మండలంలోని పెద్దసిద్దాపూర్, సలుగుపల్లి గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. రైతులకు సంబంధించిన భూ సమస్యల పరిష్కారం కోసం దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డీటీ బీమ్లానాయక్ తదితరులు ఉన్నారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): దహెగాం మండలంలోని లగ్గాం, హత్తిని గ్రామాల్లో శుక్రవారం తహసీల్దార్ మునావర్ షరీఫ్ ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు దరఖాసులు అందజేశారు., సమస్యల పరిష్కరించే దిశగా చర్యలు చేపట్టాలని తహసీల్దార్ తెలిపారు. సదస్సులో ఎంఆర్ఐ నాగభూషణం, సిబ్బంది పాల్గొన్నారు.

కెరమెరి (ఆంధ్రజ్యోతి): మండలంలోని హట్టి, పార్డ గ్రామాల్లో శుక్రవారం రెవెన్యూ అధికారులు రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ భూమేశ్వర్, డీటీ సంతోష్‌లు దరఖాస్తులు స్వీకరించారు. ప్రజలకు సంబందించిన భూముల వివరాలలో పొరపాట్లు, విరాసత్‌లు, ఇతర రెవెన్యూ రికార్డులలో తప్పొప్పులు సరి చేయనున్నట్లు తెలిపారు .ఈ కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది ఉన్నారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): మండలంలోని ధనోర(పి)లో శుక్రవారం అధికారులు రెవెన్యూ సదస్సు నిర్వహించారు.ఈ సందర్భంగా తహసీల్దార్ రథోడ్ ప్రహ్లాద్ మాట్లాడుతూ రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ నవీన్‌కుమార్, హన్మంత్‌రావు, మాజీ వైస్ ఎంపీపీ ఆత్రం ప్రకాష్, మాజీ సర్పంచ్ మేస్రం భూపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్య



గ్రామసభలో మాట్లాడుతున్న ఏసీఎంవో ఉద్దవ్

ఆసిఫాబాద్‌రూరల్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి) ప్రభుత్వ పాఠశాల్లో ఆంగ్ల బోధనలో నాణ్యమైన విద్య అందిస్తున్నామని ఏసీఎం, ట్రైబల్ వెల్ఫేర్ అకాడమిక్ మానిటరింగ్, మొబిలైజింగ్ ఆఫీసర్ ఉద్దవ్ అన్నారు. శుక్రవారం మండలంలోని మోవాడ స్కూల్ కాంప్లెక్స్ పరిధిలోని వావుదాం గిరిజన సంక్షేమ శాఖ ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేసిన బడిబాట గ్రామసభలో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఉచితంగా బోధన, పాఠ్య పుస్తకాలు, ఏకరూప దుస్తులు, సన్న బియ్యం భోజనం అందిస్తున్నామని చెప్పారు. ఆరోగ్య పరమైన ఎటువంటి సమస్యలు రాకుండా అన్ని విధాల జాగ్రత్తలు తీసు కుంటున్నామని తెలిపారు. పిల్లలను తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశా లల్లోనే చేర్పించాలని కోరారు.. కార్యక్రమంలో ఎస్‌సీఆర్పీ అనంత్, ప్రధానోపాధ్యాయుడు భీంరావు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌రూరల్, (ఆంధ్రజ్యోతి): మండలంలోని వట్టివాగు కాలనీలో బడిబాట గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయుడు మాధవ్‌రావు మాట్లాడుతూ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈ కర్యక్రమంలో ఎస్‌సీఆర్పీ రవీందర్, మాజీ సర్పంచ్ దినకర్, మాజీ ఎంపీటీసీ శంకర్, కార్యదర్శి, ఆరోగ్య కార్యకర్త, ఆఘాఖాన్ ఫౌండేషన్ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

కాగజ్‌నగర్, (ఆంధ్రజ్యోతి): బడిబాట కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాగజ్‌నగర్ ఎంపీడీఓ కోట ప్రసాద్ తెలిపారు. శుక్రవారం కాగజ్‌నగర్ మండలం ఈజ్‌గాంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, ఏఎన్ఎంలు, కార్యదర్శి సుమలత, సిబ్బంది పాల్గొన్నారు. బడిఈడు పిల్లలు బడిలో ఉండాలని కమ్యూనిటి మోబలైజింగ్ అధికారి కటుకం మధూకర్ తెలిపారు. శుక్రవారం మండలంలోని వంజరిలో ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. సమావేశంలో ప్రత్యేకాధికారి అధికారి ఎం పృధ్విరాజ్, ఎఏపీసీ చైర్మన్ పద్మ, పంచాయతీ కార్యదర్శి శ్వేత తదితరులు పాల్గొన్నారు.

పెంచికలపేట (ఆంధ్రజ్యోతి): మండలంలోని జడ్పీ పాఠశాలల్లో శుక్రవారం బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థుల తల్లిదండ్రులతో గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపా ధ్యాయురాలు విజయనిర్మల మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో పిల్లలను చేర్పించాలని కోరారు.ప్రభుత్వ పాఠశాలల్లో అందిస్తున్న విద్యా మౌలిక వసతులను వివరించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

శక్తి అభియాన్, ఇందిరా ఫెలోషిప్ సమావేశానికి తరలివెళ్లిన నాయకులు

జైనూర్, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో శుక్రవారం తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ నిర్వహించిన శక్తి అభియాన్, ఇందిరా ఫెలోషిప్ జిల్లాల కోఆర్డినేటర్లతో నిర్వహించిన సమావేశానికి జిల్లా నుంచి పలువురు హాజరయ్యారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ ఆదిలాబాద్ పార్లమెంట్ ఇన్‌చార్జి, శక్తి అభియాన్ లోక్‌సభ కోఆర్డినేటర్ ఆత్రం సుగుణతో పాటు జిల్లా శిక్ష అభియాన్, ఇందిరా ఫెలోషిప్ సభ్యురాలు ప్రతిభ, రాష్ట్ర జిల్లా కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

మొక్కలు నాటిన బీజేపీ నాయకులు



మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

కౌటాల, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): ప్రధాని నరేంద్ర మోదీ 11 సంవత్సరాల పాలన సందర్భంగా శుక్రవారం మండల కేంద్రంలో మండల స్థాయి కార్యాశాలలో భాగంగా మొక్కలు నాటారు. కార్యక్రమంలో పాలన కన్వీనర్ రాజేందర్‌గౌడ్, మండలాధ్యక్షుడు విజయ్. నాయకులు సంపత్, శ్రీనివాస్, రవీందర్, తిరుపతి, భూమయ్య, తిరుపతి, నానాజీ, తిరుపతి, షాకీరా, మహేష్, బావురావు, వెంకటేష్, నీలేష్, బాబురావు పాల్గొన్నారు.

బడిబాట పకడ్బందీగా నిర్వహించాలి



వాంకిడిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

వాంకిడి, జూన్ 6 (ఆంధ్రజ్యోతి): బడిబాట కార్యక్రమాన్ని పకడ్బందీగా నిర్వహించాలని గిరిజన సంక్షేమ శాఖ డీడీ రమాదేవి అన్నారు. మండలంలోని సవాతి గ్రామంలో బడిబాట కార్యక్రమాన్ని శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఏ ఒక్క విద్యార్థి ఇంటి వద్ద ఉండకుండా బడికి పంపించాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో ఖాజాజిజుద్దీన్, ఎంఈవో శివచరణ్‌కుమార్, నాయకులు పెంటయ్య, ప్రధానోపాధ్యాయుడు నారాయణమూర్తి, నటరాజ్, ఉపాధ్యాయులు రాజేశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

సిర్పూర్(టి), (ఆంధ్రజ్యోతి): బడి బయట ఉన్న పిల్లను పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో వేణుగోపాల్‌రావు అన్నారు. వెంపల్లి జిల్లా పరిషత్ పాఠశాల నుంచి గ్రామంలో ర్యాలీ నిర్వహించారు.

దహెగాం, (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుంచవెల్లి గ్రామంలో ఎంఈవో శ్రీనివాస్ ఆధ్వ ర్యంలో శుక్రవారం బడిబాట కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎల్‌కేజీ, యూకేజీలలో విద్యార్థులను చేర్పించాలని సూచించారు.

కౌటాల, (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలందరిని గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలని ఎంఈవో హనుమంతు అన్నారు. గుడ్లబోరి ప్రాథమికోన్నత పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని ఎంఈవో ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బాస్కర్, గ్రామ పెద్దలు వసంత్ తదితరులు పాల్గొన్నారు.

బెజ్జూరు, (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని సలుగుపల్లి ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ అన్నారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా గ్రా మంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తిరుపతి, ఆదవరావు, భుజంగరావు, వెంకటేష్ పాల్గొన్నారు.

కెరమెరి, (ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలలకు దీటుగా విద్యాబోధన ప్రభుత్వ పాఠశాలలో జరు గుతుందని ఎంఈవో ప్రకాష్ అన్నారు. గోయగాం గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రమేష్, ఉపాధ్యాయులు అర్చన, రవితేజ, గ్రామ పటేల్ శంకర్, బాపూజీ, సోనాజీ, రమేష్, హీరాజీ తదితరులు పాల్గొన్నారు.

లింగాపూర్, (ఆంధ్రజ్యోతి): బడీడు పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలని ఎంపీవో రజనికాంత్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంతో పాటు మండంలలోని 46 పాఠశాలల పరిధిలో బడిబాట కార్యక్రమాని మండలంలోని ఉపాధ్యాయులు, అధికారులు నిర్వహించారు.

సిర్పూర్(యు), (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్య అందు తుందని ఎంఈవో కుడ్మెత సుధాకర్ అన్నారు. మండల కేంద్రంలోని ప్రాథమిక పాఠశాలలో బడిబాట నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు,విద్యార్థులు పాల్గొన్నారు.

రెబ్బెన (ఆంధ్రజ్యోతి): ప్రాథమిక పాఠశాలలో బడిబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో శంకరమ్మ, ఎంఈవో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ బడీడు పిల్లలను తప్పకుండా పాఠశాలల్లో చేర్పించాలని సూచించారు. సమావేశంలో గ్రామస్థులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.